
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024


..రయ్‌రయ్



పూర్తయిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డు

సర్వాంగ సుందరంగా.. అధునాతనంగా.. ఆహ్లాదకరంగా.. రక్షణాత్మకంగా.. పర్యావరణహితంగా.. చిలకలూరిపేట బైపాస్ అందుబాటులోకి వచ్చేసింది. ఎన్నో ఏళ్లుగా.. చిలకలూరిపేటవాసుల కలగా.. చిలకలూరిపేట మీదగా రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడే వారి కష్టాలను తీరుస్తూ ఎట్టకేలకు బైపాస్ నిర్మాణం జరిగింది. 16వ నంబరు జాతీయ రహదారిపై గుంటూరు, ఒంగోలు మధ్య చిలకలూరిపేట పట్టణాన్ని బైపాస్ చేస్తూ సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యయంతో 16.384 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మాణం చేశారు. దేశంలోనే మొదటిసారిగా మోడల్ బైపాస్‌గా రూపొందించిన ఈ రోడ్డుపై వాహనదారులు రయ్‌రయ్‌మంటూ త్వరలో ప్రయాణించనున్నారు. ఎన్నో ప్రత్యేకతలతో నిర్మాణం జరిగిన బైపాస్‌ను ఈ నెలాఖరుకు ప్రారంభించే అవకాశం ఉంది.

- సుందరంగా చిలకలూరిపేట బైపాస్
- దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డు
- ఈ నెలాఖరులో ప్రారంభించడానికి సన్నాహాలు
- చిలకలూరిపేటకు మణిహారంగా రోడ్డు నిర్మాణం



1. సర్వీస్ రోడ్ పక్కన నిర్మించిన బస్సు షెల్టర్
2. నరసరావుపేట మార్గంలో నిర్మించిన అండర్ పాస్
3. బైపాస్ పక్కన ఏర్పాటుచేసిన సోలార్ వ్యవస్థ

బైపాస్ రోడ్డు ప్రత్యేకతలు

- చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం.
- గణపవరం వద్ద విశాలమైన ప్రదేశంలో రెండు చోట్ల ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు.
- రోడ్డు పొడవునా ఒకవైపున ట్రీ గార్డులతో 3,500 మొక్కలను నాటుతున్నారు. డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.
- బైపాస్ రోడ్డులో అత్యంత అధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు చేశారు.
- ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణం చేసే వాహనదారులకు సుమారు 30 నిమిషాల సమయం ఆదా.
- మొత్తం మూడు ఫ్లై ఓవర్లు, ఆరు అండర్ పాస్‌ల నిర్మాణం

చిలకలూరిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎన్నో సవాళ్లు.. మరెన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు చిలకలూరిపేట బైపాస్ రహదారి అందుబాటులోకి వచ్చేసింది. జాతీయ రహదారిపై మార్టూరు గుంటూరు మధ్య రామచంద్రాపురం వద్ద ప్రారంభమై తిమ్మాపురం గ్రామం వరకు నిర్మాణం జరిగింది. బైపాస్ రోడ్డు భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు ఖర్చు చేయగా, రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.700 కోట్లు ఖర్చు చేశారు. సర్వాంగ సుందరంగా, వాహనదారులకు ఇబ్బంది లేని రీతిలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో ఓగేరు, కుప్పగంజి వాగులపై రెండు వంతెనలను నిర్మించారు. ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ ల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బొప్పాడి

(మిగతా 8లో)

చీఫ్‌విప్‌గా జీవీ

- ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- ఆంజనేయులు కష్టానికి దక్కిన ఫలితం
- ఎట్టకేలకు పల్నాడు జిల్లాకు కీలక పదవి



నరసరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ చీఫ్‌విప్‌గా వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మంత్రివర్గంలో ఇటు గుంటూరు నుంచి ఇద్దరికి, అటు బాపట్ల జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు వరించాయి. అయితే పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి పదవికి కూడా దక్కలేదు. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాకు ఎట్టకేలకు కీలక పదవి దక్కింది. వినుకొండ నుంచి గోనుగుంట్ల వెంకట శివ సీతారామాంజనేయులు(జీవీ) మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రతిపక్షంలో ఐదేళ్లు పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ఈక్రమంలో ఆయన కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. జీవీకి మంత్రి పదవి వస్తుందని జిల్లా పార్టీ వర్గాలు భావించాయి. అయితే మంత్రివర్గ కూర్పులో కులాల సమీకరణల కారణంగా జీవీకి మంత్రి పదవి దక్కలేదు. ఈ పరిస్థితుల్లో

(మిగతా 8లో)

పడవ రేవులకు గిరాకీ

గింజుపల్లికి రూ.54 వేలు ఉంటే.. రూ.3.50 లక్షలకు పాడారు

మాదిపాడుకు,తాడువాయి రేవులకు పోటాపోటీ

వల్లభాపురానికి ఒక్కరు కూడా రాలేదు

8

ఏపీలో జపాన్ విద్యా విధానం

టోయామా యూనివర్సిటీతో ఒప్పందం

ఏఎన్‌యూలో జపాన్ బృందం సమావేశం.. హాజరైన ఆరు వర్సిటీల వీసీలు

8



వర్సిటీ వీసీ, అధికారులతో భేటీ అయిన జపాన్ బృందం

తెనాలి రైల్వేస్టేషన్‌లో రూ.35 లక్షల వెండి పట్టివేత

6

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

సహకార.. ఎన్నికలేనా?

- ఎన్నికలపై ఆసక్తి చూపని ప్రభుత్వం
- త్రి సభ్య కమిటీల కొనసాగింపునకు కసరత్తు
- ఐదేళ్లుగా అధికారుల చేతిలో సొసైటీల నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. అయితే ఇందుకు గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచే నిర్ణయాలతో సరిపెట్టింది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను నియమిస్తూ కాలయాపన చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి

2019 నుంచి అధికారుల చేతుల్లోనే సొసైటీలు

సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 2018లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధ్యక్షుల పదవీ కాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీల్లో ప్రత్యేక పాలన ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరు నెలలకొకసారి త్రి సభ్య కమిటీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది.



జొన్నలగడ్డ సొసైటీ భవనం

వచ్చిన తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని రైతులు ఆశించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం నియమించిన త్రి సభ్య కమిటీలు రాజీనామా చేశాయి. అయితే సొసైటీల ఎన్నికలను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కూడా ఆసక్తి చూపడంలేదన్న వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. ఈ మేరకు కమిటీలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సమాచారం. సొసైటీల ఎన్నికలకు సంబంధించి సభ్యులను గుర్తించాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు ప్రత్యేక పాలన కొనసాగించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు సహకార వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొంత కాలం ఎన్నికలు వాయిదా పడినట్లేనన్న ప్రచారం జరుగుతోంది. సొసైటీల నిర్వహణ ప్రస్తుతం అధికారుల చేతిలో ఉంది. ముగ్గురు, లేదా ఐదుగురు అధికారులను సొసైటీలకు నామినేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ముగ్గురా.. ఐదుగురా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

ఇష్టారాజ్యంగా కమిటీలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కొన్ని సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయన్న విమర్శలున్నాయి. కొన్ని చోట్ల రైతులను ఇబ్బందులకు గురిచేశాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించుకున్నాయి. కొన్ని త్రి సభ్య కమిటీలు ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆయా నియామకాలకు పాత తేదీలను నమోదు చేసుకుని మినిట్స్ రాసుకున్నట్లు సమాచారం. ఎన్నికలు లేక పోవడంతో తాత్కాలిక కమిటీలు పలు అక్రమాలకు పాల్పడ్డాయన్న విమర్శలున్నాయి. పంట రుణాలు మంజూరులో కూడా రాజకీయంగా కమిటీలు ఇబ్బందులకు గురిచేసినట్లు రైతులు వాపోతున్నారు.

యార్డుకు.. లక్షన్నర టిక్కీలు

- క్వింటాల్‌కు రూ.1500 తగ్గిన ధర
- మిర్చి విక్రయానికి పోటీపడుతోన్న రైతులు
- కృష్ణ, ప్రకాశం, నంద్యాల నుంచి కూడా రాక
- 50 వేల టిక్కీలకే ఈనామ్‌లో బిడ్డింగ్ అవకాశం

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి కొత్త పంట రాక ప్రారంభం అవుతుండగా.. కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసిన టిక్కీలను విక్రయించేందుకు రైతులు పోటీ పడుతున్నారు. ఈ రెండు నెలల్లో విక్రయించుకోలేకపోతే జనవరి నుంచి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చే కొత్త పంటతో ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తూ ప్రస్తుత అన్‌సీజన్‌లో రోజుకు లక్షన్నర టిక్కీల శాంపిల్స్‌ని విక్రయానికి పెడుతున్నారు. అయితే ఎగుమతుల డిమాండ్ లేకపోవడంతో కనీసం 50 శాతం టిక్కీలు కూడా కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో ధర నేలచూపులు చూడటం ప్రారంభించింది. కొద్ది రోజుల నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచే కాకుండా కృష్ణ, ప్రకాశం, నంద్యాల నుంచి కూడా రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి మిర్చి టిక్కీలను తీసుకొస్తున్నారు. అన్ సీజన్‌లో రైతులు కేవలం శాంపిల్స్ మాత్రమే తీసుకొస్తారు. ఆయా శాంపిల్స్‌కు సంబంధించిన లాట్స్‌లో ఎన్ని టిక్కీలు ఉన్నాయో పేర్కొంటారు. ఆ విధంగా చూసుకుంటే రోజుకు 1.50 లక్షల టిక్కీలకు సంబంధించిన శాంపిల్స్ పెడుతున్నారు. అన్ సీజన్‌లో ఇంత భారీగా మిర్చి టిక్కీలను విక్రయానికి పెట్టిన దాఖలాలు గతంలో లేవు. ఈ కారణంతో మేలిమి రకాలు నెల క్రితం క్వింటాల్ రూ.18500 దాటగా నేడు రూ.1500లకు పైగా తగ్గాయి. మంగళవారం గుంటూరు మిర్చియార్డులో తేజ వెరైటీ క్వింటాల్ రూ.16500, ఆర్మూరు, బ్యాడిగి రకాలు రూ.12500, 334 రకం రూ.13 వేలు ధర మాత్రమే లభించింది.



క్షీణించిన ఎగుమతులు

బంగ్లాదేశ్, చైనా దేశాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. బంగ్లాదేశ్‌లో కొత్త పంట మార్కెట్‌ని ముంచెత్తడంతో దాని ప్రభావం తేజపై పడింది. చైనాలోనూ కొత్త పంట వచ్చిన కారణంగా ఆ దేశ దిగుమతిదారులు ఆర్డర్స్ పెట్టడం లేదు. మిర్చియార్డులో ఎక్స్‌పోర్టు వెరైటీలుగా తేజ, బ్యాడిగి, ఆర్మూరుకు గుర్తింపు ఉన్నది. మిగతా రకాలన్నీ కారం తయారీకి వినియోగిస్తారు. అలాంటిది ఇప్పుడు తేజ, బ్యాడిగి, ఆర్మూరుకు డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు జరగడం లేదు. శీతల గిడ్డంగుల్లో నేటికీ 35 లక్షల మిర్చి టిక్కీల వరకు నిల్వ ఉన్నట్లు మార్కెటింగ్ వర్గాల సమాచారం. కర్ణాటక, నంద్యాల నుంచి రోజుకు వెయ్యికి పైగా కొత్త మిర్చి పంట టిక్కీలు వస్తున్నాయి. వీటి వల్ల కోల్డ్‌స్టోరేజ్‌లలోని నిల్వలు నెమ్మదిగా తగ్గుతున్నాయి. మరో రెండు నెలల పాటు రోజుకు 50 వేలకు పైగా మిర్చి టిక్కీల విక్రయం జరిగితేనే కోల్డ్‌స్టోరేజ్‌లు ఖాళీ అవుతాయి. కాగా ప్రస్తుతం నిల్వ ఉన్న టిక్కీలలో 15 లక్షల టిక్కీల వరకు తాలుకాయలు ఉన్నట్లు సమాచారం.

ధర పతనంపై రైతుల్లో ఆందోళన

గత ఏడాది మిర్చి క్వింటాల్ ధర రూ.19 వేల నుంచి రూ.20 వేల మధ్య ఉన్నప్పుడు రైతులు ఇంకా ఎక్కువ ధర వస్తుందని ఆశించి డిమాండ్ ఉన్నా విక్రయించలేదు. అప్పట్లో క్వింటాల్ రూ.28 వేలకు చేరుకుంటుందని అంతా భావించారు. అయితే అప్పటి నుంచి ధర పెరగకపోగా ఇంకా తగ్గింది. ఇప్పుడు మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో మార్కెట్‌లో వచ్చిన ధరకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు. ఈ కారణంగా కోల్డ్‌స్టోరేజ్ చార్జీల రూపంలో భారీగానే నష్టపోతున్నారు. ఇంకా కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి సరుకు బయటకు తీసుకురాకపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందన్న భావనతో ప్రస్తుతం డిమాండ్‌కు మించి మిర్చి టిక్కీలను తీసుకొస్తున్నారు. అయితే ఎగుమతుల డిమాండ్ లేకపోవడంతో కనీసం 50 శాతం టిక్కీలు కూడా కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో ధర నేలచూపులు చూస్తోంది. వివిధ రకాల మిరపకాయలకు క్వింటాల్‌కు దాదాపుగా రూ.1500 వరకు ధర తగ్గినట్లు దిగుమతి వ్యాపారులు చెబుతున్నారు. ఇంకా ధర తగ్గినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదంటున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పీఎంఏవై ఇళ్లను మార్చికి పూర్తి చేయాలి

పేరేచర్ల హౌసింగ్ లేఅవుట్ పరిశీలనలో కలెక్టర్

మేడికొండూరు, గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. మార్చి అనంతరం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావని, అప్పుడు రాష్ట్ర బడ్జెట్ నుంచే ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నం అవుతుందన్నారు. ఈ దృష్ట్యా ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేలా లబ్ధిదారులు, కాంట్రాక్టర్స్, హౌసింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం తాడికొండ నియోజకవర్గం, గుంటూరు నగర పరిధిలోని పేరేచర్ల హౌసింగ్ లే అవుట్, ఎంఎస్ఎంఈ కింద నెలకొల్పిన యూనిట్, మేడికొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. తొలుత పేరేచర్లలోని లే అవుట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేరేచర్ల, ఏటుకూరు, లాం, పొత్తూరులలో ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యంలో 200 రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అప్రోచ్ రోడ్లు, నిర్మాణాలకు అవసరమైన నీరు, గ్రావెల్ అవసరం ఉందన్నారు. సామగ్రి ధర పెరిగినందున క్రషర్స్, క్వారీ యాజమానులతో మాట్లాడి తక్కువకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మైనింగ్, హౌసింగ్ అధికారులకు సూచించారు. ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ కండక్టర్ చోరీపై ఫిర్యాదు చేసినట్లు ఎలక్ట్రికల్ డీఈఈ కలెక్టర్‌కు తెలిపారు. లే అవుట్ లో రాత్రి వేళల్లో గ్రావెల్, ఇసుక దొంగలిస్తున్నారని వీటి నియంత్రణకు పోలీస్ పహారా ఏర్పాటు చేయాలని లే అవుట్ నివాసితులు కలెక్టర్‌ను కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ రాత్రి పూట గస్తీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. పేరేచర్లలో ఎంఎస్ఎంఈ కింద పైలట్ ప్రాజెక్టుగా రూ.5.50 లక్షల రుణంతో ఏర్పాటు చేసిన శ్రీవిజయలక్ష్మీ ఫ్యాన్సీ అండ్ బుక్ స్టోర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆన్‌లైన్ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని యజమాని బోయపాటి నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మేడికొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా తిని పరిశీలించారు. జనన సర్టిఫికెట్‌లో మార్పులు చేర్పులు చేసుకోవాలంటే పంచాయతీ, ఆర్డీవో స్థాయిలో తనిఖీ చేసి రిపోర్ట్ ఇస్తే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కే శ్రీనివాస్‌రావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎలక్ట్రికల్ డీఈఈ చల్లా రమేష్, సివిల్ సప్లయిస్ డీడీ దేవరాజ్, డీఈవో రేణుక, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేశు, డీఆర్డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మి, మేడికొండూరు తహసీల్దార్ కళ్యాణి, ఎంపీడీవో చందన , ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, ఎంఈవో ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.



పేరేచర్ల హౌసింగ్ లేఅవుట్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్

పోలీస్‌స్టేషన్లో డేటా చౌర్యంపై విచారణ ముమ్మరం

ఎస్పీకి అర్బన్ ఏఎస్పీ రమణమూర్తి ప్రాథమిక దర్యాప్తు నివేదిక

బోరుగడ్డకు సంబంధించి లీకైన మరో సీసీ ఫుటేజ్ వీడియో

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రాచ మర్యాదలకు సంబంధించి లీకైన సీసీ ఫుటేజి డేటా చౌర్యం కేసు దర్యాప్తును పోలీసు అధికారులు ముమ్మరం చేశారు. శాఖకు సంబంధించిన సీసీ కెమెరాలోని డేటా చౌర్యంపై పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఆ డేటాను ప్రైవేటు టెక్నీషియన్‌గా ఉన్న శేషు అలియాస్ శేషగిరిరావు లీక్ చేసినట్లు ఇప్పటికే పోలీస్ అధికారులు గుర్తించారు. దీంతో శేషును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా ఈ కేసు దర్యాప్తును అడ్మిన్ ఏఎస్పీ రమణమూర్తి ముమ్మరం చేశారు. పోలీసుల అదుపులో ఉన్న శేషును వివిధ కోణాల్లో విచారించడంతో పాటు డేటా చౌర్యానికి సంబంధించిన కొన్ని ఆధారాలను కూడా సేకరించినట్లు తెలిసింది. లీకేజీ వ్యవహారంపై ఏఎస్పీ నివేదిక సిద్ధం చేసి ఎస్పీకి అందించినట్లు తెలుస్తోంది. ఓ విలేకరి ఫుటేజీ అడగడంతోనే తాను ఇచ్చినట్లు టెక్నీషియన్ శేషు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అయితే ఇప్పటికే నమోదైన కేసులో నిందితులుగా పేర్కొన్న శేషు తోపాటు విలేకరిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇదిలాఉంటే మంగళవారం బోరుగడ్డ పోలీస్ కస్టడీకి సంబంధించిన మరో వీడియో విడుదల కావడంతో పోలీస్ అధికార యంత్రాంగం విస్మయానికి గురైంది. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజి లీకేజి దర్యాప్తు విచారణను వేగవంతం చేశారు. బోరుగడ్డ పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో రాత్రి డ్యూటీలో ఉన్న ఎవరెవరు విధుల నిర్వహించారో వారందరిని గుర్తించి వారి నుంచి ఏఎస్పీ స్టేట్‌మెంట్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉంటే టెక్నీషియన్ శేషు సెల్‌ఫోన్‌లో వందల కొద్దీ రికార్డింగ్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆయా సంభాషణలు కూడా వింటున్నట్లు తెలిసింది. ఇప్పటికే సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పంపిన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అలసత్వంపై కూడా అధికారులు విచారిస్తున్నారు.

డిప్యూటేషన్ పేరిట తిష్ఠ.. అవినీతికి పరాకాష్ఠ

- ఓ ద్వితీయశ్రేణి అధికారిపై వల్లమాలిన ప్రేమ!
- పాఠశాల విద్యాశాఖకు ఆర్‌జేడీ కార్యాలయం ద్వారా లేఖ
- అక్రమాల రింగ్ మాస్టర్‌కు ఉన్నతాధికారుల వెన్నుదన్ను
- హెచ్‌ఎంలు, ఎంఈవోల నిరసన

గుంటూరు(విద్య),నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసి కమిషనరేట్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఇక్కడ ఆయన లేకపోతే అక్రమ వసూళ్ళకు రింగ్ మాస్టర్ లేడనే ఉద్దే శ్యంతో డిప్యూటేషన్ పేరుతో ఆయనను మళ్లీ పాత స్థానంలోనే కొనసాగేలా ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది కొంతమంది పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి ఉన్నతాధికారుల మద్దతు పలకడంతో ఆ ద్వితీయ శ్రేణి అధికారి తీరు వివాదాస్పదం అవుతోంది. ఇటీవల ప్రభుత్వం పాఠశాల విద్యశాఖలో భారీ ఎత్తున బదిలీలు చేసింది. తొలుత డీవోలను బదిలీ చేసింది. ఆరోపణలు ఉన్న వారికి పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. ఆ తర్వాత కార్యాలయాల్లో సిబ్బందిని బదిలీ చేశారు. ఏళ్ళ తరబడి ఒకేచోట పాతుకుపోయి అక్రమాలకు దన్నుగా ఉన్నారనే ఉద్దేశ్యంతో అనేక మందిని బదిలీ చేసింది. ఇందులో భాగంగా మూడు జిల్లాలను పర్యవేక్షించే గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయంలో పని చేసే ఓ ద్వితీయ శ్రేణి అధికారిని కూడా బదిలీ చేసి కమిషనరేట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అయితే, ఇక్కడ నుంచి ఆయన వెళ్లిపోతే అక్రమ వసూళ్ళకు ఆస్కారం ఉండదని, ఆదాయం పడిపోతుందనే ఉద్దేశ్యంతో ఆయన డిప్యూటేషన్‌పై కొనసాగేందుకు ఉన్నత స్థాయి అధికారులు కూడా మద్దతు పలకడం విస్మయం కలిగిస్తోంది. ఆ అధికారిని డిప్యూటేషన్‌పై ఇక్కడే నియమించడంపై హెచ్‌ఎంలు, ఎంఈవోలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అయినట్లు సమాచారం.

ఆది నుంచి వివాదాస్పదమే

ఆ ద్వితీయ శ్రేణి అధికారి తీరు మొదటి నుంచి వివాదాస్పదమే. సాక్షాత్తు ఇక్కడ పనిచేసే ఉద్యోగులపై ఆయన కర్రపెత్తనం చేస్తాడని, పైస లిచ్చిన ఫైల్స్‌కు మాత్రమే క్లియరెన్స్ ఇస్తారని ప్రచారం ఉంది. ప్రైవేటు పాఠశాలల అనుమతులు వారికి జారీ చేయాల్సిన ఎన్‌వోసిల విషయంలో భారీ మొత్తంలో వసూళ్ళు చేసి కార్యాలయంలో వాటాలు రూపంలో పంపిణీ చేస్తారని ప్రచారం.

- ఎంఈవోలుగా పని చేసిన వారికి ఎఫ్‌ఏసీ అలవెన్స్‌ల మంజూరులో ఆయన వ్యవహరించిన తీరు తీవ్ర దుమారం రేపింది. ఎఫ్ ఏసీలుగా పని కాలానికి ఎంఈవోలకు చెల్లించాల్సిన నగదు విషయంలో ఆయన వేసిన కొర్రీలు వివాదస్పదమయ్యాయి. చివరకు ఎంఈ వోలు కోర్టులో తేల్చుకుంటామంటూ ఉన్నతాధికారులకు స్పష్టం చేయడంతో చివరకు వారికి ఎఫ్ఏసీ అలవెన్స్‌లు చెల్లించారు.
- కార్యాలయానికి వచ్చే హెచ్‌ఎంలను, ఎంఈవోలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న విషయాలను కూడా భూతద్దంలో చూపి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తాడని ఎయిడెడ్, హెచ్‌ఎంలు చెబుతున్నారు.
- ఈ అధికారి కార్యాలయానికి 12 గంటలకు వస్తారు. రాత్రి 9 గంటల వరకు ఉంటాడు. ఆయన ఉన్నంత వరకు మహిళా సిబ్బంది సైతం కార్యాలయంలో ఉండాలని హుకుం జారీచేస్తాడనే ఫిర్యాదులు ఉన్నాయి. ఇలాంటి అధికారికి ఇక్కడే కొనసాగేలా ఉన్నతాధికారులు మద్దతు ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఆర్‌జేడీ కార్యాలయం



జిల్లా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన పంచాయితీ రాజ్ కమిషనర్

- నూతన భవన నిర్మాణం కోసం ఛైర్ పర్సన్ విజ్ఞప్తి
- ప్రమోషన్‌లు, జీపీఎఫ్ సమస్యలపై ఉద్యోగస్తులు ఏకరవు

గుంటూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):పంచాయితీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ గుంటూరు జిల్లా పరిషత్ అధికారులను ఆశ్చర్యానికి గురిచేశారు. మంగళవారం ఆకస్మికంగా జడ్పీని సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణతేజన జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈఓ జ్యోతి బసు, డెప్యూటీ సీఈఓ కృష్ణ సన్మానించారు. అనంతరం పంచాయితీ రాజ్ కమిషనర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి జిల్లా పరిషత్ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్ పర్సన్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ కార్యాలయ భవనం సుమారు 70 సంవత్సరాల క్రితం నిర్మించిందని కమిషనర్‌కు వివరించారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనంలో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వం సీనరేజీ నిధులతో పాటు, కోట్ల రూపాయలు బకాయిలు పెట్టిందని పేర్కొన్నారు. ఛైర్ పర్సన్ హోదాలో తనకు రావాల్సిన కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని చెప్పారు. ఛైర్ పర్సన్ చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని త్వరలో పరిష్కరిస్తానని కృష్ణ తేజ హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్, ఇంజనీరింగ్, డ్వామా అధికారులతో పంచాయితీ రాజ్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించి ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని, జీపీఎఫ్, ఇతర సమస్యలు ఉన్నాయని పలువురు ఉద్యోగులు వివరించారు.



జడ్పీ కార్యాలయంలో జడ్పీ ఛైర్ పర్సన్, సీఈఓ, డెప్యూటీ సీఈఓతో సమావేశం నిర్వహిస్తున్న పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ

జిల్లా పరిషత్ సమావేశం 23 కి వాయిదా

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఈ నెల 23న సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ వీ జ్యోతి బసు వెల్లడించారు. తొలుత ఈ నెల 20న సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



మిర్చియార్డులో లారీ ఓనర్స్‌తో సమావేశమైన పర్సన్ ఇన్‌చార్జి భార్గవ తేజ, పోలీసు, రవాణ, మార్కెటింగ్ శాఖాధికారులు

మిర్చియార్డుకు చెడ్డ పేరు తీసుకురావొద్దు

- సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి
- ఏ ఒక్కరూ చట్టాన్ని ఉల్లంఘించడానికి ప్రయత్నించొద్దు
- జీఏఎంపీసీ పర్సన్ ఇన్‌చార్జి జేసీ భార్గవ తేజ

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు ఆసియా ఖండంలోనే ప్రఖ్యాతి గాంచిందని, అటువంటి యార్డుకు ఏ ఒక్కరూ చెడ్డపేరు తీసుకురావొద్దని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ ఆదేశించారు. స్థానిక మిర్చియార్డు పరిపాలనభవనంలో మంగళవారం సాయంత్రం నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసియేషన్, ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, హమాలీలు, వేమెన్స్‌తో వేర్వేరుగా ఆయన సమావేశాలు నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరో నెలలో మిర్చి సీజన్ యార్డులో ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తాము తీసుకుంటామని, ఇందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మిర్చి ట్రేడింగ్ తర్వాత సరుకు త్వరితగతిన బయటకు వెళ్లిపోయేలా చూడాలని అన్నారు. నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో జరిగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. తొలుత లారీ యజమానుల సంఘం అధ్య క్షుడు కొండలు, ఉపాధ్యక్షుడు నక్కల శ్రీనివాసరావు, ఇలియాజ్, దాసరి ప్రసాద్‌లు మాట్లాడారు. బంగ్లాదేశ్ బోర్డర్‌కు ఇక్కడి నుంచి మిర్చి ఎగుమతి జరుగుతుందని, కిరాయి రూ. 1.60 లక్షలు లేనిదే గిట్టుబాటు కాదని చెప్పారు. 2008లో తమ అసోసియేషన్ ఏర్పాటై అప్పటి నుంచి ఎగుమతిదారులతో సమన్వయం చేసుకుంటూ లారీలను మిర్చి రవాణ నిమిత్తం కిరాయికి పెడుతున్నామన్నారు. అలాంటిది సంవత్సరం నుంచి ఒక ఎగుమతిదారుడు, మరో లారీ సప్లయర్ కలిసి అనారోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని చెప్పారు. బయట నుంచి లారీలు తీసుకురావడం, కిరాయిని తగ్గించడం వంటివి చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. పెరిగిన టోల్, రోడ్డు, గ్రీన్ ట్యాక్స్‌లు భరించలేకపోతున్నాం. ఎత్తు లోడుతో లారీ ఒడిస్సా, బెంగాల్, అసోంలో నుంచి ప్రయాణిస్తే రూ. 35 వేలు పెనాల్టీ వేస్తున్నారని చెప్పారు. వే బిల్లులు ఇవ్వడానికి దిగుమతి వ్యాపారస్తుల గుమాస్తాలు రూ. 2,200 తీసుకొంటున్నారని, యార్డులో మోకులు కట్టినందుకు రూ. 5,500 వసూలు చేస్తున్నారని చెప్పారు. జేసీ స్పందిస్తూ ఎవరికి వీలున్న రేటుకు వాళ్ల లారీలు పెట్టుకోవచ్చని దానిని ఆపే అధికారం ఏ ఒక్కరికి లేదని అన్నారు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ల నిర్ణయాలు తీసుకొంటే తాము అందుకు మద్దతివ్వబోమని స్పష్టం చేశారు. అన్నివర్గాలతో చర్చించిన అనంతరం తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వినుకొండ ఆంజ నేయులు, డీఎస్పీ పీ మల్లికార్జున రావు, డీటీసీ సీతారామిరెడ్డి, ఆర్‌టీవో బీ సత్యన్నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదానికి కారణమైన రాయల్‌మెరైన్ లారీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- బుద్దాం మలుపులో ఆటోను ఢీ కొట్టిన లారీ
- ఆటోడ్రైవర్ మృతి, చికిత్స పొందుతూ మరొకరు
- ఏడుగురికి తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన ఆటోలో ఇరుక్కుపోయిన హరీష్ మృతదేహం



బాడిగా హరీష్ (ఫైల్‌ఫొటో)

కర్లపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన కర్లపాలెం మండలంలోని బుద్దాం మలుపు దగ్గర మంగళవారం జరిగింది. కర్లపాలెం ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం కర్లపాలెంకు చెందిన బాడిగ హరీష్ (29) ఆటోడ్రైవర్ .అయ్యప్పమాల దీక్షలో ఉన్నారు. కర్లపాలెం నుంచి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని చందోలు నుంచి వెళుతూ బుద్దాం దగ్గర ప్రయాణికులు దిగేందుకు ఆపాడు. వారి వద్ద డబ్బులు తీసుకుంటుండగా, చందోలు నుంచి కర్లపాలెం వైపు వస్తున్న రాయల్ మెరైన్ లారీకి ఎదురు బైక్ రావడంతో దానిని తప్పించేందుకు లారీ డ్రైవర్ సడన్ బ్రేక్.. హ్యాండ్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో లారీ వెనుక భాగం తగిలిన ఆటో నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ఆటోలోని 8 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్లపాలెం పోలీసు వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలిస్తుండగా దేవరకొండ వెంకటేశ్ మృతి చెందాడు. ఖాజీపాలెంకు చెందిన బెజ్జం ఇందిరా, బుద్దాంకు చెందిన మద్దిబోయిన శ్రీనివాసరావు, రాయగడ్‌కు చెందిన హబ్బి అకాష్, గణపవరం చెందిన దేవరకొండ గణేష్, పశ్చిమబెంగాల్‌కు చెందిన నిశి పొన్నవార్, ప్రశాంత్ పొన్నవార్, మేన కలకు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, సీఐ బి.హరికృష్ణ, తహసీల్దార్ సుందరమ్మ, ఎస్సై రవీంద్ర సందర్శించి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, లారీనీ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు మృతుడు .దేవరకొండ వెంకటేష్‌కు భార్య జయశ్రీ, ముగ్గురు పిల్లలు హర్ష, భరత్, ఆదిత్య ఉన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు మబీన్

అమరావతి, నవంబరు 12: ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థి పి.మబీన్ ఎంపికైనట్లు పీఈటీ అనూరాధ తెలిపారు. ఈ నెల 9,10,11 తేదీలలో యనమదలలో జరి గిన రాష్ట్ర జట్టు ఎంపికలో మబీనాను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మబీన్‌కు పాఠశాల బోధనా సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్టు

కొల్లిపర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లో టీడీపీ కార్యకర్త తూమాటి రాజేంద్రప్రసాద్‌పై మూకుమ్మడిగా దాడి చేయడంతో పాటు ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్యాయత్నం చేయబోయిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లో తూమాటి రాజేంద్రప్రసాద్‌పై వైసీపీకి చెందిన దూసరి అనిల్, దూసరి బాజీ, యద్దు కిశోర్, తూమాటి అజయ్‌బాబు, పిల్లి హరీష్‌తో పాటు మరో నలుగురు ట్రాక్టర్‌తో ఢీ కొట్టి విచక్షణా రహితంగా దాడి చేశారు. బాధితుడు రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దూసరి అనిల్, దూసరి బాజీ, యద్దు కిశోర్, తూమాటి అజయ్‌బాబు, పిల్లి హరీష్‌లను తెనాలి రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా, వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిని నరసరావుపేట సబ్‌జైలుకు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

రూ.35 లక్షల వెండి పట్టివేత

తెనాలి క్రైం, నవం బరు 12 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని సేలం నుండి అక్రమంగా వెండిని తరలిస్తున్న వ్యక్తిని తెనాలి రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. జీఆర్‌పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం, సేలంకి చెందిన హరేరాం మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో శబరి ఎక్స్‌ప్రెస్‌లో 4వ నంబరు ప్లాట్‌ఫారంపై దిగివస్తుండగా సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటాద్రి అతనిని ఆపి అతని వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. అందులో 38 కిలోల బరువు కలిగిన రూ.35 లక్షల వెండి వస్తువులు లభించాయి. నిందితుడు వీటికి సంబంధించి సరైన రశీదులు చూపించకపోవడంతో అక్రమ రవాణాగా భావించి వాటిని ఇన్ కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కి స్వాధీనం చేసినట్లు చెప్పారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక నిఘా వ్యవస్థ కొనసాగుతుందన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

11 ఇసుక లారీలు పట్టివేత

అమరావతి, నవంబరు 12: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అర్ధరాత్రి సమయంలో ఇసుకను అక్ర మంగా తరలిస్తున్న 11 లారీలను సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో ప్రత్యేక టీం కాపుకాసి లారీ లను అదుపులోకి తీసుకుంది. తుళ్లూరు మండలం బోరు పాలెం నుండి ఇసుకను అక్రమంగా వడ్లమాను రోడ్డులో డంపింగ్ చేసి దానిని లారీల్లో లోడింగ్ చేసి గుంటూరుకు తరలిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎస్పీ తన ప్రత్యేక బృందంతో గుంటూరు రోడ్డులో కాపుకాసి ఇసుకతో వస్తున్న 11 లారీలను పట్టుకుని, అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అందులో ఒకలారీ దిడుగు నుండి ఇసుకను లోడ్ చేసుకుని వస్తుండగా సత్తెనపల్లిరోడ్డులోని ఆరుడొంకల బావివద్ద పట్టుబడింది.

50,805 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,507 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,805 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,674 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15500	334	8000	16000
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	9500	12500
273	9000	12000	273	11000	13000
341	8200	14500	341	8500	15000
4884	9500	12000	4884	11700	14500
సూపర్ 10	-	-	సూపర్ 10	12000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	17000	తేజ	8000	17500
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	8500	13000
దేవనూరు డీలక్స్	8500	14000	దేవనూరు డీలక్స్	8000	15000
తెల్లకాయలు	5000	11000	తెల్లకాయలు	5000	10700

మాయమాటలతో మేనమామ మోసం

తెనాలి మారీసుపేట,భట్టిప్రోలు (కొల్లూరు) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మేనకోడలికి మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భవతిని చేసిన మేనమామ ఉదంతం మంగళవారం వెలుగు చూసింది. యువతి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, భట్టి ప్రోలుకు చెందిన యువతి తల్లి మృతి చెందాడు. ఆమె తండ్రి బతుకుదెరువు నిమిత్తం ఆదిలాబాద్‌కు వెళ్లాడు. పెద్దమేనమామ వద్ద ఆ యువతి ఉంటోంది. చిన్న మేనమామ తరచూ అక్కడికి వెళ్లి ఆ యువతికి మాయ మాటలు చెప్పి లోబరచుకున్నాడు. యువతి ఆలనాపాలనా చూస్తున్న ఆమె పిన్ని యువతిలో శారీరక మార్పులు చోటు చేసు కోవడంపై ప్రశ్నించింది. కడుపునొప్పి, నడుమునొప్పి అని చెబుతున్న ఆమెను చెరుకుపల్లి మండలం కనగాలలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లగా యువతికి పరీక్షలు చేసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని సిఫార్సు చేశారు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ఆ యువతిని గర్భవతిగా నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న యువతి చిన్నమ్మ, చిన మేనమామే ఇందుకు కారణం అని పేర్కొంది. ఈ ఘటన గురించి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించిన పోలీసులు ఈ ఉదంతం తమ పరిధి కాదని భట్టిప్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని వైద్యులకు తెలిపారు. ఈ విషయమై భట్టిప్రోలు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు వస్తే దర్యాప్తు చేస్తామని తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

చంద్రబాబు పాలనతో దళితులకు మంచిరోజులు

● ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో దళితులకు మంచి రోజులు వచ్చాయని ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్య రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీలకు దాదాపు 19 వేల కోట్లు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేసిన దళిత సంక్షేమ పథకాలకు చంద్రబాబు పునరుజ్జీవం ఇచ్చినట్లయ్యిందన్నారు. దళిత విద్యార్థులు విదేశాలలో చదువుకునే అవకాశాన్ని జగన్ రెడ్డి తీసివేసి విదేశీ విద్య పట్ల వారి ఆశలపై నీళ్లు చల్లాడని, కూటమి ప్రభుత్వం విదేశీ విద్యకు బడ్జెట్ కేటాయించటం, విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరును పునరుద్ధరించడం, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో అవకాశాలు కల్పించడం దళితుల పట్ల చంద్రబాబు ఉన్న అభిమానం, ప్రేమకు నిదర్శనమన్నారు. దళితుల అభివృద్ధి, ఆత్మ గౌరవం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువైందన్నారు.

డిసెంబరు 8న జానపద గీతాలు, ఏకపాత్ర పోటీలు

గుంటూరు(తూర్పు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో డిసెంబరు 8వ తేదిన జానపద గీతాలు, సాంఘిక చారిత్రాత్మక ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇప్టా జాతీయ కార్యదర్శి గని తెలిపారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18-35 వయస్సు కల్గిన వారికి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు 94414 52819, 94917 94056 నెంబర్లు సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఆరేటి రామారావు, మిట్టపల్లి మహేంద్ర, చెవుల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం

గుంటూరు(తూర్పు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎల్ బీఈడీ కాలేజీ ఆవరణలో ఈ నెల 14 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో పుస్తక మహోత్సవం జరుగుతుందని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాదు, బుక్ హౌస్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అరండల్‌పేటలోని విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ పుస్తక మహోత్సవంలో 20 వేల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 9 గంటలకు వరకు పుస్తక ప్రదర్శన జరుగుతుందని అన్నారు. అంతేగాక డిసెంబరు 1 నుంచి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 6 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ఆవిష్కరణలు, విద్యార్థులకు పోటీలు జరుగుతాయని తెలిపారు. పుస్తక మహోత్సవంను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్రను పాఠ్యాంశంలో పొందుపరచాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్రను పాఠ్య అంశంలో పొందుపరచాలనే డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లక్ష పోస్టు కార్డులు పంపే ఉద్యమాన్ని చేపట్టినట్టు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు. స్థానిక బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ పిలుపుమేరకు మంగళవారం దళిత బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోస్ట్ కార్డుల ప్రదర్శన జరిగింది. ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ శృతి వనాలు, అధ్యయన కేంద్రాలు(లైబ్రరీలు) ప్రతి మండలంలోనూ ఏర్పాటు చేయాలని, అమరావతిని అంబేద్కర్ బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దాలన్నారు. వీటితో పాటు 8 అంశాలపై ముఖ్యమంత్రికి పోస్టు కార్డులను పంపుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు చాట్ల డెనిస్ రాయ్, సాధు మాల్యాద్రి, గంట ప్రభుదాస్, నల్లపు నీలాంబరం, రావినూతల కమల కుమారి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జీసీకేవీఎన్ విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వర్శిటీలో నిర్వహించిన అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థినులు 81 కేజీల విభాగంలో టి.నాగజ్యోతి సిల్వర్ మెడల్, 81 కేజీల విభాగంలో ఎస్‌కె అబ్దుల్ మస్తాన్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, కోచ్ ఎండి కమ్రుద్దీన్, అధ్యాపకులు చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా బుదవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డి 8 సెక్షన్ పరిధిలోని కృష్ణనగర్ ఒకటో లైను నుంచి మూడో లైను వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే డి 2 సెక్షన్ పరిధిలోని ఏటుకూరు గ్రామం, బైపాస్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మూడు వీల్‌చైర్లు అందజేత

గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రెడ్‌క్రాస్ సొసైటీ తరపున స్థానిక అమరావతిరోడ్‌లోని ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రికి మూడు వీల్ చైర్లను విరాళంగా అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పీ రామచంద్రరాజు ఈ వీల్‌చైర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రఘుకు అందజేశారు. దాత రామచంద్రరాజును వైద్యులు అభినందించారు.

నూరు శాతం ఇంటింటా చెత్త సేకరణ చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు.

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో డిసెంబరు 1 నుంచి నూరుశాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా ప్రజారోగ్య విభాగ కార్యాచరణ ఉండాలని, అందుకు తగిన విధంగా స్పెషల్ అధికారులు పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ పులి శ్రీని వాసులు ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ప్రజారోగ్య విభాగ శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేక పర్యవేక్షణ అధికారులతో నగరంలో పారి శుధ్య పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడు తూ ప్రజారోగ్య విభాగంలో ప్రతి ఒక్కరూ అంకిత బావంతో పని చేయాలన్నారు. డిసెం బర్ 1 నుంచి నగరంలో ప్రతి ఇంటి నుంచి నూరు శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. అందుకు తగిన విధంగా డివిజన్ల వారీగా ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కార్మికుల రేషనలైజేషన్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, సీఎంవోహెచ్‌వో డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌వో రవిబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ప్రత్యేక అధికారులు, శానిటరీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్లలో ప్లాస్టిక్ వినియోగించకూడదు

గుంటూరును సుందర నగరంగా తీర్చిదిద్దుకోవడంలో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల పాత్ర కీలకమని, నగరపాలక సంస్థ పరిధిలోని కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల ల్లో నిషేధిత ప్లాస్టిక్ వినియోగించకుండా, జీరో వేస్ట్ ఈవెంట్స్ చేపడుతూ నగరపాలక సంస్థకు సహకరించే వారికి ఆస్తి పన్నులో రాయితీ అందించేందుకు చర్యలు తీసుకుంటా మని కమిషనర్ తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మంది రంలో జీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, ఫంక్షన్ హాళ్లు ఉన్న హోటళ్ల యజమానులతో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక సమా వేశం నిర్వహించారు.

తాగునీటి సరఫరాలో ఉదాసీనం వద్దు

తాగునీటి సరఫరా విషయంలో ఉదాసీనం సరికాదని కమిషనర్ అన్నారు. మంగళవా రం కమిషనర్ సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకును పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి వస్తున్న పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పనుల్లో జాప్యం వల్ల నగరంలో తాగునీటి సరఫరాలో లోపం జరుగుతుందని తెలిపారు. తాగునీటి సరఫరా విషయంలో ఇంజనీరింగ్ అధికారులు ఉదా సీనంగా వ్యవహరించకూడదని అన్నారు. లీకు పనులను 3 రోజుల్లో పూర్తి చేసేలా కాం ట్రాక్టర్‌తో సమన్వయం చేసుకోవాలని ఈఈని ఆదేశించారు.

అపార్‌ని వేగంగా పూర్తి చేయాలి

గుంటూరు నగరంలో విద్యాసంస్థల్లో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఆర్)ని వేగంగా పూర్తి చేయాలని, ప్రధానంగా ఇంటర్మీడియట్ విద్యా సంస్థలు అపార్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్ఐవో, ఎంఈవోలు, గుంటూరు నగ రంలోని ప్రైవేట్ ఇంటర్మీడియట్ విద్యాసంస్థల ప్రతినిధులతో అపార్ రిజిస్ట్రేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు 1 నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థి అపార్ నమోదు తప్ప ని సరి అని అన్నారు.

కన్నబాబుకి కమిషనర్ శుభాకాంక్షలు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కె.కన్నబాబుని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్ర ఎంఏయూడీ కార్యదర్శి కన్నబాబుకు మొక్క అందజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రతి ఒక్కరూ.. షుగర్ నివారణ చర్యలు చేపట్టాలి



డయాబెటీస్ వాక్‌లో డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): షుగర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి, వ్యాధి నివారణపై దృష్టి సారించాలని ప్రభుత్వ [illegible] సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం పురస్క రించుకొని మంగళవారం కొత్తపేటలోని ఎస్‌వీఆర్ షుగర్ ఆసుపత్రిలో జరిగిన మధుమేహ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. షుగర్ వైద్యనిపుణులు డాక్టర్ వీవీ రామకుమార్ అధ్యక్షతవహించారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ షుగర్ వచ్చిన వారు వైద్యుల సలహా మేరకు తగిన మందులు వాడుతూ రోజూ వ్యాయామం చేస్తూ వ్యాధిని అదుపులో ఉంచుకోవాలని సూచించారు. దంత వైద్యనిపుణులు డాక్టర్ వీ కమల మాట్లాడుతూ వరల్డ్ డయాబెటిస్ డే పురస్కరించుకొని ఎస్‌వీఆర్ షుగర్ ఆసుపత్రిలో ఈనెల 12వ తేదీ నుంచి డిసెంబర్ ఒకటి వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు రోగులకు ఉచిత దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం జరిగిన డయాబెటిస్ వాక్‌ను సూపరింటెండెంట్ ప్రారంభించారు. పలువురు వాక్‌లో పాల్గొన్నారు.

జమిలి ఎన్నికల పేరుతో దేశంలో అధ్యక్ష తరహా పాలన : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల పేరుతో అధ్యక్ష తరహా పాలనను దేశంలో తీసుకువచ్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో మంగళవారం జిల్లా సీపీఐ సమితి సభ్యుల సమావేశం జరిగింది. సభకు జిల్లా కార్యవర్గ సభ్యుడు కాబోతు ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ మోదీ పాలనతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని గ్రహించి జమిలీ ఎన్నికలను తెరపైకి తీసుకువస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. పట్టణ పేదలకు 2 సెంట్లు, గ్రామీణ పేదలకు 3 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలనే హామీను నెరవేర్చాలని కోరుతూ ఈనెల 18న సచివాలయాల్లో అర్జీ అందజేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, పుప్పాల సత్యనారాయణ, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు పాల్గొన్నారు.

జీఎస్టీలో ట్యాక్స్ కన్సల్‌టెంట్‌ల పాత్ర కీలకం

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ శాఖలో ట్యాక్స్ కన్సల్‌టెంట్‌ల పాత్ర ఎంతో కీలకమైనదని సెంట్రల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. కన్నావారితోట ఐదోలైనులో ఈజీ టాక్స్ పేరుతో ఏర్పాటు చేసిన ట్యాక్స్ కన్సల్టెన్సీ సర్వీస్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. సీజీఎస్టీ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్, ఈజీ ట్యాక్స్ నిర్వాహకుడు చుక్కా విల్సన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ చెల్లింపు దారులు అవగాహన లోపంతో అనేక తప్పులు చేస్తున్నారని, వాటిని సరిదిద్దేందుకు ట్యాక్స్ కన్సల్టెంట్లు ఎంతో అవసరమన్నారు. ఈజీ ట్యాక్స్ అధినేత చుక్కా విల్సన్‌బాబు మాట్లాడుతూ సేవే లక్ష్యంగా ఒకే ఒక్క రిజిస్ట్రేషన్‌తో ఎన్నో రకాల జీఎస్టీ సేవలు పొందవచ్చన్నారు. డిప్యూటీ కమిషనర్ వి.వెంకటేశ్వరరావు, జీఎస్టీ నిఘా విభాగం అసిస్టెంట్ కమిషనర్‌లు ఎం.నాగరాజు, రవికుమార్, విశ్రాంత ఏసీలు రాజేశ్వరరావు, వివేకానంద, క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి తదితరులున్నారు.

పార్టీ మారిన ఆ కార్పొరేటర్లపై వేటు వేయాల్సిందే..?

● ఓ హోటల్లో సమావేశమైన నగర వైసీపీ కార్పొరేటర్లు



అంబటి రాంబాబుతో సమావేశమైన నగర వైసీపీ కార్పొరేటర్లు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరిన కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాలని నగర వైసీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరు నగరంలోని బ్రాడీపేటలోని ఓ హోటల్లో తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియో జకవర్గాలకు చెందిన వైసీపీ నగర కార్పొరేటర్లు రహస్యంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి చివరిలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ హాజరయ్యారు. ఉదయం 11గంటలకు భేటీ అయిన వైసీపీ కార్పొరేటర్లు మధ్యాహ్నం మూడు గంటల వరకు సుదీర్ఘంగా అనేక అంశాలపై చర్చించా రు. పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలని అన్నారు. వీరిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకొని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మరి కొంతమంది కార్పొరేటర్ పట్టుపట్టారు. పార్టీకి, పదవికి రాజీనామా చేసిన తర్వాతనే పార్టీ మారాలని అన్నారు. నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీ కాలం ముగిసింది, మూడు నెలలు గడుస్తున్నప్పటికీ, స్టాండింగ్ కమిటీ ఎన్నికల నిర్వహించడం లేదని పలువురు కార్పొరేటర్లు వాపోయారు. ఈ విషయంపై మేయర్ మనోహర్ నాయుడు తాత్సారం చేస్తున్నారని, తక్షణమే స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని కార్పొరేటర్లు కోరారు. నగరపాలక సంస్థలో ఎవరి అనుమతి లేకుండా అడ్డగోలుగా 130 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించారని, ఈ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనిపై క్షేత్రస్థాయిలో విజిలెన్స్ దర్యాప్తు జరిగేలాగా ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో వైసీపీ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, పగడాల సుబ్బారెడ్డి, రోషన్, అబీద్, మహమ్మద్, మర్రి అంజలి, మలవరపు రమ్య, అంబేద్కర్, ఆచారి, గురవయ్య, కోఆప్షన్ సభ్యులు పునూరి నాగేశ్వరరావు, షాడో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వ్యర్థాలతో కళాఖండాల తయారీ

గుంటూరు(విద్య), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో వ్యర్థాల నుంచి కళాఖండాలు అనే అంశంపై మంగళవారం విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ పి.గోపిచంద్ తెలిపారు. కళాశాలలోని ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ సెల్ ఆధ్వర్యంలో పెడిలైట్ కంపెనీ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. పాత గాజుసీసాలు ఉపయోగించి ఫ్లవర్‌వాజ్‌లు, చెయిన్స్, డాలర్స్ తయారు చేసి వాటిపై రకరకాల బొమ్మల్ని విద్యార్థులు వేశారు. కాటన్‌తో రకరకాల వస్తువులు తయారు చేశారు. ఈ కోర్సులో మొత్తం 52 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపల్ గోపిచంద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎక్స్‌టెన్షన్ వింగ్ సభ్యులు డాక్టర్ ప్రశాంతి, వీణ, అంజనీ, సరోజ, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు. కోర్సులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

రైతుల్లో అల్పపీడన బెంగ

● దిక్కుతోచని స్థితిలో పత్తి రైతులు

గుంటూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులకు నిద్ర లేకుండా చేస్తుంది. మూడు రోజుల పాటు దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పత్తి రైతుల్లో కొత్త దిగులు మొదలైంది. మంగళవారం ఉదయం నుంచి గుంటూరు జిల్లాలో వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం సమయానికి సముద్ర తీరానికి దగ్గరలో ఉన్న మండలాల్లో భారీ వర్షం కురిసింది. బుధ, గురు, శుక్రవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ ఏడాది ఇప్పటికే విస్తారంగా కురిసిన వర్షాలకు పంటలు అతలాకుతలం అయ్యాయి. కొద్దిగా కోలుకునే సమయంలో మళ్ళీ అల్పపీడన ద్రోణి ఏర్పడటంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి రైతులు బాగా దెబ్బ తినే అవకాశం ఉందని అంటున్నారు.

కర్రసాము పోటీలలో సీతారామయ్య హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): నేషనల్ ట్రెడిషనల్ సిలంబం ఛాంపియన్ షిప్ వారు నిర్వహించిన కర్రసాము పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య (సీటీఎస్ఈ) పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 8, 9వ తరగతి చదువుతున్న సుధారాణి, డెన్నిస్ రాజ్, మణికంఠ, రిషీకార్తీక్, కౌషిక్ కృష్ణ, ఓంకారేశ్వర్‌రెడ్డి, చరణ్ కార్తీక్, ఆరాధ్య, పార్థు, శివ పరుశురామ తదితరులు సిలంబంలో సబ్ జూనియర్ 40 -45 కేజీల బాడీ వెయిట్ విభాగం రాష్ట్ర స్థాయిలో విజయకేతనం ఎగుర వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, సీనియర్ కో ఆర్డినేటర్ దుర్గాశ్యామ్, శిలంబం శిక్షకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు పెదకాకాని సెంటర్‌లో ముగ్గురు మాజీ ప్రధానుల విగ్రహావిష్కరణ

● హాజరుకానున్న ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పెదకాకాని సెంటర్‌లో ఏర్పాటు చేసిన ముగ్గురు మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ఆవిష్కరించేందుకు ఈనెల 14వ తేదీన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పెదకాకానికి విచ్చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు తెలిపారు. రాజీవ్‌గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి ఉత్తమ సేవలందించిన ముగ్గురు మాజీ ప్రధానుల విగ్రహాలను ఏర్పాటు చేయటం స్ఫూర్తిదాయకం అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జొన్నల వెంకటరెడ్డి, యన్నం సుధీర్‌బాబు, బిక్కా సునీల్, చుక్కా చంద్రపాల్ తదితరులున్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు(విద్య), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు స్వర్ణ పతకాలు సాధించారని ప్రిన్సిపల్ గర్నెపూడి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన ఒ.కీర్తిశ్రీ అండర్ 19 విభాగంలో నాలుగు విభాగాల్లో స్వర్ణపతకాలు సాధించగా మరో విద్యార్థిని పి.రూప ఒక విభాగంలో స్వర్ణపతకం సాధించినట్లు తెలిపారు. అదే విధంగా మరో విద్యార్థిని టి స్వాతి అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో రజిత పతకం సాధించగా సీఈసీ జూనియర్ విద్యార్థిని మనీ అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థినుల్ని ప్రిన్సిపల్ జి.సునీత, అధ్యాపకులు అభినందించారు.

తూర్పు కాపులకు ఓబీసీ గుర్తింపు సాధిద్దాం : యశస్వి

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో ఉన్న తూర్పు కాపులకు ఓబీసీగా గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తానని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం యశస్విని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించిన సందర్భం పురస్కరించుకొని మంగళవారం జనసేన, తూర్పుకాపు సంఘం నేతలు కలసి సత్కరించారు. యశస్వి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది తూర్పు కాపుల అభివృద్ధికి, వారు ఆర్థికంగా ఎదిగేందుకు కార్పొరేషన్ తరపున తమవంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. యశస్విని కలసి అభినందించిన వారిలో రాష్ట్ర తూర్పు కాపు సంఘం ఉపాధ్యక్షుడు, గుంటూరు నగర జనసేన పార్టీ కార్యదర్శి కొత్తకోటి ప్రసాదు, జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు అబోతుల రామారావు, సంఘం నగర ప్రధాన కార్యదర్శి వంజరపు దేవీప్రసాద్, జిల్లా నాయకడులు రేజేటి మణికంఠ, రేజేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించండి : సీఐ

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పిల్లలు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యా లకు అలవాటు పడకుండా తల్లిదండ్రులే జాగ్రత్తలు తీసుకోవాలని పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు సూచించారు. ఈ మేరకు గంజాయి విక్రయిస్తూ, తాగుతూ పట్టుబడిన 25 మంది పిల్లల తల్లిదండ్రులతో మంగళవారం పోలీస్‌స్టేషన్లో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి కేసుల్లో ఇరుక్కుంటే వారికి పాస్‌పోర్టు, వీసాలు రావని, ఉద్యోగావకాశాలు కోల్పోతారని, అంతేగాక వారిపై షీట్లు తెరవడం జరుగుతుందని సీఐ వీరేంద్రబాబు తల్లిదండ్రులను హెచ్చరిం చారు.

పదిమంది జూదరుల అరెస్టు

స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావు తోట శ్మశానాల వద్ద పేకాట ఆడుతున్న జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వీరనాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడి చేసి 10మందిని అదుపులో తీసుకుని వారి నుంచి లక్ష మూడువేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద అదృశ్యమైన నాలుగేళ్ల చిన్నారి ఆచూకీ లభ్యమైంది. ఈనెల 9న తల్లిదండ్రులు చిన్నారి మూ డావత్ తేజస్వినిని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద వదిలి టిఫిన్ చేసేందుకు వెళ్లి రాగా బాలిక కనిపించలేదు. కాగా తల్లిదండ్రులు ఈనెల 11న లాలాపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రంగంలో దిగిన లాలాపేట సీఐ ఏవి శివప్రసాద్ బాలిక ఆచూకీ కనుగొన్నారు. వీరు ఉంటున్న ఇంటికి మూడు లైన్ల అవతల వారికి తెలిసిన వారింట్లో బాలిక ఉంది. బాలిక తల్లిదండ్రులు మందు తాగి ఎక్కడబడితే అక్కడ రోడ్లపై పడిపోతుంటారని, పిల్లలను పట్టించుకోరని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. వారికి తేజస్వినితో పాటు ఏడేళ్ల కుమారుడు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఇద్దరు పిల్లలను తల్లిదండ్రులతో సంబంధం లేకుండా హోమ్‌లో చేర్పించాలని సీఐ శివప్రసాద్ నిర్ణయించారు.

పారిశ్రామిక ప్రగతికి కృషి చేయండి

● దేగలకు సీఎం చంద్రబాబు సూచన



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్‌కు సూచించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో మంగళవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను దేగల ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పదవులను బాధ్యతగా భావించి పనిచేయాలని వారిరువురూ దేగల ప్రభాకర్‌కు సూచించారు. పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులు రాబట్టడంలో కీలకపాత్ర పోషించి పార్టీ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. దేగల ప్రభాకర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సమన్వయంతో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ విజన్‌కు అనుగుణంగా లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు.

బీసీల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్ : వేములకొండ

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్ బీసీ సంక్షేమమే లక్ష్యంగా ఉందని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ కొనియాడారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన నేతృత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు బీసీ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 బడ్జెట్ లో బీసీల సంక్షేమానికి రూ.39,007 కోట్లు కేటాయించడంపై బీసీ సామాజికవర్గం ఎంతో సంతోషంగా వుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 5 నెలల్లోనే కార్పొరేషన్ పదవులకు చైర్మన్లను నియమించడమే కాకుండా, కార్పొరేషన్లకు నిధులు కూడా కేటాయించి చంద్రబాబు నాయుడు బీసీల మనిషి అని నిరూపించుకున్నారన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాలకు వారధిగా రాష్ట్ర బడ్జెట్ ఉందని అన్నారు. కార్యక్రమంలో గట్టి శ్రీనివాస్, ప్రభాకర్, బెల్లంకొండ సురేష్, గొడుగు శంకర్, బొబ్బిలి రామారావు, పినపాటి వెంకట శివ వకుళాదేవి, హర్సేన్, పుల్లా సుందరాంబాబు, షేక్ చిన్న బాజీ, పాటిబండ్ల బలరాం, నాయుడు మధు, ముప్పాళ్ళ మురళి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో స్పైరులినా ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్ ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో స్పైరులినా ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ఆచార్య పి.నాగభూషణ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్యాబ్లెట్స్ తయారీలో ఈ ల్యాబ్ ఎంతో కీలకమని, వివిధ రూపాల్లో టాబ్లెట్స్‌ను ప్రాసెసింగ్ చేయడం, నాణ్యత వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ల్యాబు ఏర్పాటు చేసినట్లు వీసీ నాగభూషణ్ తెలిపారు.

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న కోడూరి మోహనరావు

గుంటూరు(తూర్పు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను బాపట్ల జిల్లా కారంచేడు మండలం తెమిడిదెపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి కోడూరి మోహనరావు విరాళంగా ప్రకటించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని కమ్మ బాలికల వసతి గృహంలో కేజేఎస్ఎస్ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు మంగళవారం ఆయన చెక్కును అందజేశారు. సామినేని మాట్లాడుతూ కోడూరి మోహనరావు గతంలో ఉపకార వేతనాల మూలనిధికి రూ.2 లక్షలను అందజేసారని గుర్తు చేశారు. దాతల సహకారంతో త్వరలోనే భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎన్నారై నవులూరి కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం



వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న బ్యాంకు అధికారులు

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 106వ వార్షిక వేడుకలు పట్టాభిపురం బ్రాంచిలో ఘనంగా జరిగాయి. ఖాతా దారులు, ప్రభుత్వం, బ్యాంక్ వారు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్లు రామాంజనేయులు, అశ్విని కోరారు. అభివృద్ధి చెందుతూ యూనియన్ బ్యాంక్ ఉన్నతికి సహకరించాలని కోరుతూ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖాతాదారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులున్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన అవసరం




సదస్సులో పాల్గొన్న డాక్టర్ గీతారుక్మిణి తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై విద్యార్థినులకు కనీస అవగాహన అవసరమని డాక్టర్ గీతారుక్మిణి అన్నారు. స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో రోటరీక్లబ్ ఆఫ్ ఆదర్శ్, ఒమేగా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రధానంగా 14 నుంచి 25 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి రోహిణిదేవి, రోటరీ క్లబ్ సభ్యులు కె.హిమబిందు, డాక్టర్ కె.పద్మజ, జి.భారతి, ఎం.అనురాధ, మాధవీలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



విజేతలను అభినందిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, డాక్టర్ పి.విజయ తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని, అప్పుడే వారు భవిష్యత్తులో రాణిస్తారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బాలానంద కేంద్రం ఆధ్వర్యంలో రుద్ర కళాక్షేత్రం సహకారంతో స్థానిక కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి బాల కళా ప్రభ సాంస్కృతిక కళా సంబరాలు మంగళవారంతో ముగిసాయి. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారతీయ కళలకు ప్రాధాన్యతను గుర్తించి వాటిపై ఆసక్తి కల్పించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ తల్లి ఉగ్గుపాల పాటలోనే మన కళల సంస్కృతి అద్దం పడుతున్నదని వివరించారు. కార్యక్రమంలో బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి జె.అనూష, కార్యదర్శి నడింపల్లి గురుదత్, కోఆర్డినేటర్ మాచిరాజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



..రయ్‌రయ్

(5వ పేజీ తరువాయి)

పురుషోత్తమపట్నం, చిలకలూరిపేట, గణపవరం, నాదెండ్ల వద్ద అండర్ పాస్‌ల నిర్మాణం చేశారు. బొప్పూడి, కోటప్పకొండ, గణపవరం, నాదెండ్ల ప్రాంతాల్లో 8 బస్ షెల్టర్లు నిర్మించారు. రోడ్డుకు ఒకవైపున ప్రధాన సర్వీస్ రోడ్డు ఉంటుంది. అండర్ పాస్‌ల వద్ద రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు 15 సంవత్సరాల పాటు ఈ రోడ్డు నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం చేశారు. పశువులు రోడ్డుపైకి రాకుండా ఉండడానికి, ఆక్రమణలను అరికట్టడానికి, ప్రమాదాల నివారణకు ఈ గోడను నిర్మించారు. రోడ్డు పక్కన గణపవరం వద్ద హైవేస్‌కు చెందిన విశాలమైన ప్రదేశం రెండు చోట్ల ఉంది. దీంతో దానిని సద్వినియోగం చేసుకునేందుకు ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సోలార్ ప్లేట్లను బిగిస్తున్నారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పగటి వేళలో గ్రిడ్‌కు అనుసంధానం చేసి, రాత్రిళ్లు రోడ్డుపై లైట్ల వెలుగులకు వినియోగించనున్నారు. బైపాస్ రోడ్డు పొడవునా ఒకవైపున 3,500 మొక్కలను నాటుతున్నారు. వాటిలో గానుగ, వేప, నల్లమద్ది, గుల్మోరా, పెంట్ పామ్ జాతుల మొక్కలు ఉన్నాయి. ప్రతి మొక్కకు ట్రీ గార్డును ఏర్పాటు చేస్తున్నారు. వీటికి నిత్యం నీటిని అందించి సంరక్షించేందుకు రెండు చోట్ల బోరు పాయింట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.

నాణ్యతా ప్రమాణాల తనిఖీలు

రోడ్డు నిర్మాణం పనులు పూర్తయినట్లుగా బీఎస్‌సీపీఎల్ కంపెనీ కాంట్రాక్టర్లు నేషనల్ హైవే సంస్థకు నివేదించారు. దీంతో హైవేస్ అధికారులు పనుల నాణ్యతా ప్రమాణాల పరిశీలన చేస్తున్నారు. పరిశీలన అనంతరం రోడ్డు ప్రారంభోత్సవానికి పచ్చజెండా ఊపుతారు. ఇప్పటికే నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం ఆధ్వర్యంలో రోడ్డు తనిఖీ జరిగింది. బైపాస్ రోడ్డులో అత్యంత ఆధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు జరిగింది. వాహనాల వేగంపై కన్నేసి ఉంచేందుకు ప్రత్యేక పరికరాలు బిగించారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్గేట్ వద్దకు చేరే విధంగా ఏర్పాటు జరిగింది.

టోల్‌గేట్‌లేని మార్గంగా బైపాస్

చిలకలూరిపేట వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయినా ఈ మార్గంలో టోల్‌గేట్ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వ్యయాన్ని రాబట్టుకోవడానికి గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్‌గేట్ వద్ద రేట్లను పెంచవచ్చని సమాచారం.

చిలకలూరిపేట ప్రజలకు తప్పనున్న తిప్పలు


బైపాస్ రోడ్డుపై అధికారికంగా రాకపోకలకు అనుమతిస్తే చిలకలూరిపేట ప్రజలకు ఊరట లభిస్తుంది. ప్రస్తుతం పట్టణం మధ్యగా వెళ్లే జాతీయ రహదారిపై మూడు ప్రధాన సెంటర్లలో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. దీనివల్ల ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణం చేసే వారికి సుమారు 30 నిమిషాల సమయం వృథా అవుతున్నది. పట్టణ ప్రజలు రోడ్డు దాటి వెళ్లాలంటే కనీసం 20 నిమిషాల సమయం పడుతున్నది. దీనికి తోడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బైపాస్ రోడ్డును ప్రారంభిస్తే అధిక శాతం వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి కాబట్టి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. కాలుష్యం సమస్యకు కూడా తెరపడుతుంది.

భారత్-ఈ జట్టులో

అఖిల పావనికి స్థానం



మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికిచెందిన మహిళా క్రికెటర్ కడియం వాసవి అఖిల పావని భారత్- ఈ మహిళల జట్టులో స్థానం సంపాదించింది. బీసీసీఐ ఆధ్వర్యంలో గత నెల 17 నుంచి వివిధ వేదికలపై సీనియర్ మహిళా టీ-20 టోర్నీ జరిగింది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన 75 మందిని బీసీసీఐ ఎంపిక చేసింది. వీరిని ఏ, బీ, సీ, డీ, ఈ జట్లుగా విభజించింది. ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీ వేదికగా ఈ నెల 17 నుంచి జరుగనున్న చాలెంజర్స్ ట్రోఫీలో ఈ జట్లు తలపడ తాయి. బీసీసీఐ సీనియర్ మహిళా టీ-20లో వాసవి అఖిల పావని ఆంధ్రా జట్టు తరపున ఆడి మొదటి స్థానం, దక్షిణ భారత దేశంలో రెండవ స్థానం, జాతీయస్థాయిలో 15వ స్థానంలో నిలిచి చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా-ఈ జట్టుకు ఎంపికైంది. చాలెంజర్స్ ట్రోఫీలో మంచి ప్రతిభ కనబరిస్తే నేరుగా భారత మహిళల జట్టు లేదా మహిళల ఐపీఎల్ జట్లకు ఎంపికయ్యే అవకాశం ఉంది. పావనికి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.



పరీక్షలను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ ఆచార్య ఎం సుబ్బారావు

బీఈడీ పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, నవంబర్ 12(ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయని పీజీ పరీక్షల తాత్కాలిక కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. వర్సిటీ ఎదురుగా ఉన్న ప్రభల డిగ్రీ కళాశాలలో హైకోర్టు ఆదేశాలతో ఆరు కళాశాలలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

యోగ స్నిగ్ధ ముద్ర



స్నిగ్ధ యోగాసనం

శరీరాన్ని అలవోకగా మెలికలు తిప్పగలదు. అతిక్లిష్టమైన యోగాసనాలను సైతం అత్యంత సులువుగా వేయగలదు. కేవలం ఆసనాలు వేయడమే కాదు.. కూచిపూడి నృత్యంలోనూ ప్రవేశం ఉంది. విభిన్నరంగాల్లో తన ప్రతిభను కనబరుస్తూ ప్రశంసలు పొందుతున్న పదిహేనేళ్ల బాలిక పేరు స్నిగ్ధ. బాపట్ల వాసి అయిన స్నిగ్ధ పలు వేదికలపై తన ఘనతను చాటుతోంది.

- అలవోకగా ఆసనాలు.
- కూచిపూడి నృత్యంలోనూ ప్రవేశం
- ప్రతిభ చాటుతున్న విద్యార్థి స్నిగ్ధ

గురువు శిక్షణ.. అమ్మానాన్నల ప్రోత్సాహం

చిన్నప్పటి నుంచి గురువు ఖాదర్‌వలీ శిక్షణకు తోడు అమ్మానాన్నలు మాధురి, వెంకట కృష్ణప్రసాద్ ఇచ్చిన ప్రోత్సాహమే తనను యోగావైపు అడుగులేసేలా చేసింది. ఎక్కడ పోటీలు జరిగినా అమ్మే తోడుగా వచ్చేది. చదువును, యోగాను ఈ రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అమ్మ గైడెన్స్, నాన్న ఇచ్చే ధైర్యం ఎంతగానో ఉపయోగపడు తోంది. కూచిపూడి నృత్యం నేర్చుకున్నా. క్లాసికల్ డ్యాన్స్‌లో కూచిపూడి నృత్యం కూడా నేర్చుకుని ప్రదర్శనలిచ్చాను. కోర్సు పూర్తి చేసి నాంపల్లి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ అందుకున్నాను.

బాపట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మూడో తరగతి నుంచే యోగాపై ఆసక్తి కనబరిచిన బాలిక స్నిగ్ధ ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. యోగాలో తాను సాధించిన విజయాలతో పాటు ఎన్నో విషయాలను ఆ చిన్నారి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకుంది. ఆ వివరాలు స్నిగ్ధ మాటల్లోనే..

నేను కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి చదువుతున్నప్పుడే సీనియర్లు యోగా చేయడం చూశాను. అప్పటి నుంచే ఆసక్తి మొదలైంది. క్రమేపీ యోగాపై మరింత శ్రద్ధ పెరిగింది. అలవోకగా ఆసనాలు వేయడం చూసిన ఖాదర్ వలీ మాస్టారు నాకు శిక్షణ ఇచ్చారు. మరింతగా ప్రోత్సహించారు. నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు నుంచి నాకు ఆయనే యోగా గురువు. ఆసక్తి ఉన్న వారికి ఉచితంగానే మాస్టారు యోగా నేర్పించేవారు. సమయపాలనలో కఠినంగా ఉండేవారు. ఇప్పటికీ మాస్టారు ఆసనాలు వేసి నేర్పిస్తుంటారు.

ఆటలకు దూరమే..

మూడో తరగతి నుంచే ఆటలపై ఆసక్తి అంతగా ఉండేది కాదు. తోటి విద్యార్థులందరూ ఆటల కోసం గ్రౌండ్‌కు వెళితే నేను మాత్రం సాయింత్రం 5 గంటలు కాగానే మేట్ బ్యాగ్ తగిలించుకుని యోగా తరగతులకు వెళుతుండేదానిని. కొన్ని ఆసనాలు నేర్చుకోవడంలో బాగా ఇబ్బంది పడేదాన్ని. ఓ ఆసనం విషయంలో ఓ కాలు ముందుకు చాపి, మరో కాలును వెనకి నుంచి చెవి దగ్గర తాకించాల్సి ఉంటుంది. అది నేర్చుకునే క్రమంలో నొప్పి భరించలేక ఏడ్చేశాను. యోగాపై ఉన్న ఇష్టం ముందు ఆ బాధ ఏమంత పెద్దగా అనిపించలేదు. అమ్మ మాత్రం నేను పడుతున్న కష్టం చూసి ఓ వారం పాటు నాతో శిక్షణ కేంద్రానికి రావడం మానేసింది. అయితే, నా ఇష్టాన్ని అర్థం చేసుకున్న అమ్మానాన్నలు తోడుగా నిలబడ్డారు.

నేను యోగా నేర్చుకోవడం మొదలుపెట్టినప్పుడు దీనిపై ఆసక్తి చాలా తక్కువ మందికి ఉండేది. కానీ, ఇప్పుడు అందరూ దీనిపై దృష్టిపెడుతున్నారు. ఆరోగ్య రీత్యా ఆసక్తి కనబరుస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా యోగా ప్రాచుర్యం పొందడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. యోగాను క్రీడగా గుర్తించడం వల్ల కూడా భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఇది ఉపయోగపడనుంది. ఇష్టంతో నేర్చుక్న యోగ ఇప్పుడు ఎన్నో అవకాశాలకు వేదికగా నిలవడంతో పాటు రాబోయే రోజుల్లో కూడా ప్రాధాన్యం దక్కు తుందనిపిస్తోంది.

ఎస్‌జీఎఫ్‌ఐలో పాల్గొనాలి : స్నిగ్ధ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడంతో పాటు యోగాలో ఎంఎస్‌ఈ డిగ్రీ అందుకోవాలనేది నా కోరిక. అందుకు అనుగుణంగానే కష్టపడుతున్నాను. మైసూర్ నేషనల్స్ కాంపిటీషన్‌లో సెకండ్ ప్రైజ్ దక్కించుకున్నాను. ఆల్‌ఓవర్ సెంట్రల్ స్కూల్ స్టేట్ కాంపిటీషన్‌తో పాటు నేషనల్ ఒలింపియాడ్ పోటీల్లో సెకండ్ ప్రైజ్ గెలుచుకున్నాను. డిస్ట్రిక్ట్ యోగా కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతితో పాటు శాప్ పోటీల్లో తొలి బహుమతి దక్కించుకు న్నాను. రీజినల్ నేషనల్స్‌లో 3 సార్లు పాల్గొంటే ఒకసారి సిల్వర్, రెండు సార్లు గోల్డ్ మెడల్ గెలుచుకున్నాను. నేషనల్ స్టాండ్‌బైలో థర్డ్‌ప్రైజ్ వచ్చింది. ఇవన్నీ కూడా బెంగుళూరు, మైసూర్, హైదరాబాద్ వేదికగా జరిగిన పోటీలే కావడంతో కేంద్రీయ విద్యాలయం టీచర్ల దగ్గర నుంచి కూడా నాకు పూర్తిగా సపోర్ట్ ఉండేది. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న ప్రిన్సిపల్ మేడం అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు.



నేషనల్ కాంపిటీషన్స్‌లో గెలుచుకున్న మెడల్‌తో స్నిగ్ధ



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న స్నిగ్ధ







బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో జరిగిన పోటీల్లో జడ్జీలతో చిన్నారి స్నిగ్ధ (ఫైల్)

ఏపీలో జపాన్ విద్యా విధానం

- టోయామా యూనివర్సిటీతో ఒప్పందం
- విద్య, అధ్యాపక, పరిశోధనలకు ప్రణాళికలు
- ఏఎన్‌యూలో సమావేశం.. హాజరైన ఆరు వర్సిటీల వీసీలు



జపాన్ బృందానికి మెమెంటో అందజేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు, వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ విద్యా విధానం అమలు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో జపాన్‌కు చెందిన టొయామా విశ్వవిద్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం 2015 చేసుకున్న ఒప్పందం తిరిగి తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జపాన్ బృందంతో ఏపీలోని ఆరు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టోయామా యూనివర్సిటీతో ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలు, విద్యార్థి, అధ్యాపక, పరిశోధన రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అంగీకారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్, పలు యూనివర్సిటీల వీసీలు తెలిపిన వివరాలను పరిశీలించిన జపాన్ ప్రతినిధుల బృందం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో కొలాబరేటివ్ డైలాగ్ ఆన్ ఎడ్యుకేషన్ బిట్వీన్ టోయామా ప్రీఫెక్చర్ అండ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జరిగిన చర్చలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి తాత్కాలిక చైర్మన్ ఆచార్య కే.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ దేశ విద్యా విధానాన్ని కొనసాగించే క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఉన్న జపాన్ విద్య విధానంపై ఏపీలో అమలు చేసే అంశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. 2047కి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. అందులో భాగంగా జపాన్ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలుకు పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. జపనీస్ భాషపై ప్రత్యేక కోర్సును విద్యార్థులకు అందించాలని కూడా సూచించారన్నారు. నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య కే.గంగాధర రావు మాట్లాడుతూ వర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు సుకుర సైన్స్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా టొయామ యూనివర్సిటీని సందర్శించి పలు అంశాల్లో నైపుణ్యాలు పెంచుకున్నార న్నారు. ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ డైరెక్టర్ యూకో హోంగో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలతో ఒప్పందాలకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వచ్చే నెలలో టొయామా గవర్నర్ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఉంటుందని ఆపర్యటనలో ఒప్పందాలను ఖరారు చేసుకోనున్నట్లు తెలిపారు. యూజీ, పీజీ, రీసెర్చ్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మసీవంటి కోర్సులపై దృష్టిసారిస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఉమామహేశ్వరిదేవి, ఇండస్ట్రియల్ లోకేషన్ అండ్ ట్రేడ్ డివిజన్ లాజిస్టిక్ అండ్‌ట్రేడ్ డైరెక్టర్ హిదేహిస, ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ సెక్షన్ చీఫ్ ఏఐ డోబు, ఇంటర్నేషనల్ రిలేషన్స్ మాజీ కోఆర్డినేటర్ దాసరి రమేష్, పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య వెన్నం ఉమ, వెంకటేశ్వర యూనివర్సిటీ వీసీ ఆచార్య సిహెచ్. అప్పారావు, ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, జేఎన్టీయూ అనంతపురం ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్‌రావు, జేఎన్టీయూ కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌డీ మురళీకృష్ణ, నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ ఎ.కృష్ణసత్య, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.పద్మావతి, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సిద్ధయ్య, ఆచార్య ప్రమీలారాణి, వెంకటేశ్వర యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాజశేఖర్, ఇండో జపనీస్ కొలాబరేషన్ కన్సల్టెంట్ స్వాతి భగవత్ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌గా జీవీ

(5వ పేజీ తరువాయి)

చీఫ్‌విప్ పదవితో పార్టీ అధిష్ఠానం జీవీకి సముచిత స్థానం కల్పించింది. 2009, 2014లో జీవీ వినుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టీడీపీలో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లాకు టీడీపీ అధ్యక్షుడిగా దాదాపు పదేళ్ల బాధ్యతలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో టీడీపీ సభ్యత్వ నమోదులో జీవీ పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపి అధిష్ఠానం మన్ననలు పొందారు. ఇక ఆయన ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి అనేక పోరాటాలు చేశారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో శావల్యాపురం జడ్పీటీసీని గెలిపించి ప్రతిపక్షంలో కూడా ఆయన సత్తా చాటారు. జీవీకి పదవి దక్కడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పలువురు నేతలు జీవీని సత్కరించి ఆయనకు అభినందనలు తెలిపారు.

సమర్థవంతంగా నిర్వహిస్తా : జీవీ

చీఫ్‌విప్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు జీవీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. సహచర ఎమ్మెల్యేలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానన్నారు. శాసన సభ విలువలు గౌరవం పెంచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.



సతీమణి లీలావతికి మిఠాయి తినిపిస్తున్న జీవీ



జీవీని అభినందిస్తున్న ఆనందబాబు

వినుకొండకు రెండోసారి పదవి

వినుకొండ నియోజకవర్గానికి రెండో సారి చీఫ్‌విప్ పదవి దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వినుకొండ నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా గెలిచిన నన్నపనేని రాజకుమారి చీఫ్ విప్‌గా పని చేశారు. ఆ తర్వాత జీవీని ఆ పదవి వరించింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, శావల్యాపురం జడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, మేజర్ పంచాయతీల్లోని పలువురు సర్పంచ్‌లు, టీడీపీ నేతలు ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులుకి అభినందనులు తెలిపారు.

పడవ రేవులకు గిరాకీ

- గింజుపల్లికి రూ.54 వేలు ఉంటే.. రూ.3.50 లక్షలకు పాట
- మాదిపాడుకు, తాడువాయి రేవులకు పోటాపోటీ
- వల్లభాపురానికి ఒక్కరు కూడా రాలేదు



జడ్పీ కార్యాలయంలో పడవ, బల్లకట్టు రేవులకు వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని పడవ, బల్లకట్టు రేవులకు గిరాకీ పెరిగింది. రెండు దఫాలుగా వాయిదా పడుతూ వచ్చిన వేలం మంగళవారం విజయవంతంగా పూర్తయ్యింది. జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ వేలంలో రేవులు దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. పెద్దగా ప్రాధాన్యం లేదనుకున్న అచ్చంపేట మండలంలోని రేవులకు భారీ మొత్తం చెల్లించేందుకు పలువురు ముందుకు వచ్చారు. అచ్చంపేట మండలం చామర్రు పడవ రేవుకు కనీస ధర రూ.1.15 లక్షలు నిర్ణయించగా, దానిని రూ.2.12 లక్షలకు జీ రామయ్య దక్కించుకున్నారు. చింతపల్లికి రూ.91667 అని నిర్ణయించగా, రూ.96000కు రమేష్ దక్కించుకున్నారు. గింజుపల్లికి 54,167 అని నిర్ణయించగా కే వసంతారావు 3.50 లక్షలకు దక్కించుకున్నారు. తాడువాయి రేవుకు రూ.4,72,083 కనీస ధర కాగా, రమేష్ అనే వ్యక్తి రూ.7 లక్షలకు దక్కించుకున్నారు. మాదిపాడు రేవుకు రూ.5,52,083 కనీస ధర కాగా, సతీశ్ కుమార్ అనే వ్యక్తి దానిని రూ.11.20 లక్షలకు దక్కించుకున్నారు. మాదిపాడు బల్లకట్టుకు రూ.4,16,667 కనీస ధరకాగా అబ్దుల్ సత్తార్ అనే వ్యక్తి రూ.4.27 లక్షలకు దక్కించుకున్నారు. మాచవరం మండలం లోని గోవిందాపురం బల్లకట్టుకు రూ.3,33,333 కనీస ధరగా నిర్ణయించగా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 3,45,000కి దక్కించుకున్నారు. అమరావతి మండలం లోని దిడుగు పడవ రేవుకు రూ.2,77,083 కనీస ధర కాగా చంద్రశేఖర్ అనే వ్యక్తి రూ.2,88,000కు దక్కించుకున్నారు. ధరణికోట పడవ రేవుకు రూ.20,833 కనీస ధరగా నిర్ణయించగా, గోవింద్ అనే వ్యక్తి రూ.76,000కు దక్కించుకున్నారు. కొల్లిపొర మండలంలోని వల్లభాపురం రేవుకు ఎవరూ ముందుకు రాలేదని కృష్ణ తెలిపారు.

ఏఎన్‌ఎంలకు ఇతర విధులు వద్దు..

- 'హంస' విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

గుంటూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను ఇతర విధులకు వినియోగించవద్దని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కే.విజయలక్ష్మీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయ పరిధిలో వస్తున్న వివిధరకాల సర్వేలకు ఏఎన్‌ఎంలు హాజరు కావాల్సిందే అంటూ పంచాయతీ సెక్రటరీలు ఒత్తిడి చేస్తున్నట్లు ఏపీ హంస యూనియన్ జిల్లావైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఏఎన్‌ఎంలు నిర్వర్తించవలసిన విధులపై స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు సోమ, గురువారం అడల్ట్ బీసీజీ వాక్సినేషన్, బుధ, శనివారం రొటీన్ ఇమ్యునైజేషన్, శుక్రవారం ఫ్రైడే డ్రైడే మాత్రమే నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ.నాగవర్ధన్ వెల్లడించారు. ఏఎన్‌ఎంలకు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె విజయలక్ష్మీకి అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు

పట్టాయాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో సాధించిన గోల్డ్ మెడల్ తో నిశ్శంకర్రావు రవికుమార్



థాయిలాండ్‌లో మెరిసిన

గుంటూరు కుర్రోడు

వరల్డ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన రవికుమార్

గుంటూరుసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): థాయిలాండ్ పట్టాయాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం అంబరాన్ని అంటింది. గుంటూరు జిల్లా ఏటుకూరుకు చెందిన నిశ్శంకర్రావు రవికుమార్ (రవి) 65-70 కేజీల విభాగంలో ప్రపంచ స్థాయిలో స్వర్ణ పతాకం సాధించారు. ఈనెల 9,10తేదీల్లో పట్టాయాలో ఈ పోటీలలో రవికుమార్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారు. రవికుమార్ గతంలోనూపలు జాతీయ, అంత ర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించారు. 2018లో పూణేలో జరిగిన పోటీల్లో కాంస్యం, 2019 లో ఇండోనేషియా జరిగిన పోటీల్లో స్వర్ణం, 2021లో ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన పోటీల్లో కాంస్యం, 2022లో సౌత్ కొరియాలో జరిగిన పోటీల్లో కాంస్యం, 2023 లో ఫిలిప్పీన్స్ లో జరిగిన పోటీల్లో ఏషియా సిల్వర్ మెడల్స్ సాధించారు. నిశ్శంకరరావు రవికుమార్ తండ్రి వెంకట్రావు లారీడ్రైవర్ కాగా, తల్లి నరసమ్మ గ్రామం లోనే చిన్న చిల్లరదుకాణం నడుపుతున్నారు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఈ యువ బాడీ బిల్డర్ గత తొమ్మిది సంవత్సరాలుగా కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. థాయిలాండ్‌లో ఉన్న రవికుమార్ ఫోన్ లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీలో స్వర్ణం సాధించటం సంతోషం కలిగించిందన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరిన్ని గోల్డ్‌మెడల్స్ తీసుకు వస్తానన్న ధీమా వ్యక్తంచేశారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం ఏమాత్రం ఆదరణ చూపించలేదని ఆవేదన చెందారు. అప్పుడు ప్రభుత్వం చేయూత నిచ్చివుంటే రాష్ట్రానికి చాలా మెడల్స్ వచ్చి ఉండేవని అన్నారు. థాయ్‌లాండ్ నుంచి రాగానే ప్రభుత్వ పెద్దలను కలుస్తానని నిశ్శంకర్రావు రవికుమార్ తెలిపారు.



గతంలో సీఎం చంద్రబాబు నాయుడుని కలిసిన రవికుమార్

విజ్ఞాన్‌లో స్పైరులినా ల్యాబ్ ప్రారంభం

గుంటూరు(విద్య), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో స్పైరులినా ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ఆచార్య పీ.నాగభూషణ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే !

- రోడ్డుపైనే కుప్పలు తెప్పలుగా దర్శనం
- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- క్లాప్ మిత్రాల నియామకం శూన్యం
- మూలనపడ్డ చెత్త నుంచి సంపద సృష్టి తయారీ కేంద్రాలు
- ఇప్పటికైనా వినియోగంలోనికి వచ్చేనా ?





ప్రత్తిపాడులో నిరుపయోగంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు, పిచ్చి మొక్కలతో ఉన్న డంపింగ్ యార్డులోని తొట్లు

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

పల్లె సీమలు పరిశుభ్రతతో ఉండాలి అనే స్వచ్ఛ స్ఫూర్తితో నాటి తెలుగుదేశం ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు)ని ర్మించింది. అయితే ఈ షెడ్లు నిర్మించి వినియోగంలోనికి తీసుకువచ్చే సమయంలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడం జరిగింది. అప్పటినుంచి ఆయా చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ పూర్తిగా మరుగున పడింది. చెత్త సేకరణ పేరుతో వివిద విన్యాసాలు చేశారు. అయినా ఫలితాలు మాత్రం క్షేత్ర స్థాయిలో కనిపించలేదు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తిగా విస్మరించడంతో పాటు మౌలిక సదుపాయాలను కూడా కల్పించ లేదు. తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అందుకనుగుణంగా అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. కాని మేజర్ గ్రామ పంచాయతీ అయిన ప్రత్తిపాడులో మాత్రం ఇంత వరకు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును వాడుక లోనికి తీసుకురాలేదు. గ్రామాలలో చెత్త సేకరణకు క్లాప్ మిత్రాలను కూడా నియమించలేదు. గృహాల వారు రోడ్డుపై చెత్తను కుప్పలు పోస్తే వాటిని నిత్యం ఎత్తి వేయడం తప్ప గృహాల నుండి ఇంత వరకు చెత్తను సేకరించిన దాఖలాలు లేవు. ఈ విషయంలో పంచాయతీ పాలక వర్గం పూర్తిగా చేతులెత్తేయడంతో అధికారులకు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఉంది. దీనికి తోడు ప్రత్తిపాడు పంచాయతీకి పర్మినెంట్‌గా కార్యదర్శి లేకపోవడం, ఇన్‌చార్జి పాలనలో నియోజకవర్గ ప్రధాన కేంద్రం పరిపాలన సాగుతుండటంతో ఇక్కడి పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. తడి, పొడి చెత్తల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన డబ్బాలను కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో పంపిణీ చేయలేదు. అవి పంచాయతీ కార్యాలయంలోనే నిరుపయోగంగా ఉండి పోయాయి.



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ఆవరణలో డంప్ చేసిన చెత్త

వ్యర్థాలు డంపింగ్‌కి మాత్రమే పరిమితం ..

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు కేవలం వ్యర్థాలను డంపింగ్ చేయడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను కొంత ప్రధాన రహదారిపై డంప్ చేయగా, మరి కొంత షెడ్డు వద్ద డంప్ చేస్తున్నారు. ఇంత వరకు సంపదను సృష్టించే ఎలాంటి కార్యక్రమం ఇక్కడ నిర్వహించలేదంటే ఎలాంటి అతిశయోక్తి లేదు. డంపింగ్ యార్డులను నిర్మించిన సమయంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో వర్మీ కంపోస్టును తయారు చేశారు. ఆ తర్వాత ఇంత వరకు ఆ దిశగా అడుగులు వేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షెడ్డును వాడుకలోనికి తీసుకువచ్చి గ్రామంలో చెత్త సేకరణ చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

జడ్పీ హైస్కూల్లో కలెక్టరు తనిఖీ



విద్యార్థుల ప్లేటులోని భోజనం పెట్టించుకొని రుచి చూస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మేడికొండూరు నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మంగళవారం సందర్శించారు. విద్యార్థుల యూనిక్ ఐడి కోసం చేపట్టిన అపార్ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల డేటాను అప్‌లోడ్ చేసే సందర్భంలో ఎదురవుతున్న ఇబ్బందులను పాఠశాల హెచ్‌ఎం జయప్రద కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి హెచ్‌ఎంకు కలెక్టర్ సూచనలు చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజన పథకం నాణ్యతను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులు ఎదుట కూర్చుని వారి ప్లేట్‌లోని భోజనాన్ని పెట్టమని అడిగీ ఆమె ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనం పెడుతున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిత్యం భోజనం బాగానే ఉంటుందని విద్యార్థులు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కే. శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎలక్ట్రికల్ డీఈ చల్లా రమేష్, పౌరసరఫరాల శాఖ డీడీ దేవరాజ్, డీఈవో సీవీ రేణుక, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు, డీఆర్డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, మేడికొండూరు తహసీల్దార్ కేకళ్యాణి ఎంపీడీవో చందన, ఈవోపీఆర్‌డి పూర్ణ శంకరరావు పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకాల్వకు

5706 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), నవంబరు 12: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 5706 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 260 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1356 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 379 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 145 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 351 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2900 క్యూసెక్కులు విడుదల చేశారు.

14న ప్రజాపోరు ధర్నాను

జయప్రదం చేయండి

తాడేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 14న జరుగు ప్రజాపోరు ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండ ఆక్సానగర్‌లో సీపీఎం శ్రేణులు కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె కృష్ణ, గబ్బర్, పలువురు ముస్లిం యువకులు పాల్గొన్నారు.

గ్రామ సభకు 22 అర్జీలు

పెదనందిపాడు, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సంక్షేమ కార్యాలయం వద్ద గత ప్రభుత్వం చేపట్టిన భూరీసర్వేలో తలెత్తిన సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం రెవెన్యూ శాఖ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. భూ సంబంధిత సమస్యలపై 22 అర్జీలు అందినట్లు తహసీల్దార్ శంకర్‌బాబు తెలిపారు. అర్జీలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సాహితీమోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి కృషి చేయాలి

కాకుమాను, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీల బలోపేతానికి కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. మండల కేంద్రమైన కాకుమాను ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పీఎస్, సచివాలయంలో విధులు నిర్వహించే డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో గామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. పంచాయతీల ఆదాయాన్ని పెంచేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రవిబాబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.



నాగేశ్వరరావుని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కళాశాల అభివృద్ధికి విరాళం

పెదనందిపాడు, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాల అభివృద్ధి నిమిత్తం ప్రవాసాంధ్రుడు దివ్వి నాగేశ్వరరావు తన తండ్రి రత్తయ్య జ్ఞాపకార్థం రు.50వేల నగదు చెక్కును మంగళవారం ప్రిన్సిపాల్ జీ.వీరరాఘవయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుని కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ(విశ్రాంత ఏఎస్పీ), సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ నర్రా వీరయ్యలు అభినందించారు.

రాజధాని భూముల్లో మట్టి మాయం

- పెదపరిమిలో డంపింగ్ చేసి అమ్ముకుంటున్న అక్రమార్కులు
- సమాచారం అందటంతో నిల్వవున్న మట్టిని పరిశీలించిన మైనింగ్ అధికారులు
- తుళ్లూరు హైస్కూల్లో అనుమతులు లేని గ్రావెల్‌ను తోలించిన కాంట్రాక్టర్



పెదపరిమిలో ఓ చోట నిల్వ చేసిన రాజధాని ప్రాంత మట్టి

తుళ్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) రాజధాని ప్రాంతంలోని మట్టి రాత్రికి రాత్రే మాయం అవటం మొదలైంది. రాత్రిపూట లారీల్లో మట్టిని లోడ్ చేసుకొని పెదపరిమిలో ఓ చోట నిల్వచేసి, పగలు అక్కడి నుంచి దర్జాగా ట్రాక్టర్లతో తోలి అమ్ముకుంటున్నారు. విషయం మైనింగ్ అధికారులకు తెలియటంతో మంగళవారం మట్టి డంపింగ్ ప్రదేశాన్ని వారు పరిశీలించారు. ఫోటోలు తీసుకొని ఎవరు డంప్ చేశారనే కోణంలో ఆరా తీస్తున్నారు. సంబంధిత వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్టు సమాచారం.

అనుమతులు లేని గ్రావెల్..

వారం రోజుల క్రితం తుళ్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదుల సంఖ్యలో గ్రావెల్ లారీలతో మట్టిని డంపింగ్ చేశారు. గ్రౌండ్ మెరక చేయటానికి కాంట్రాక్టర్ గ్రావెల్ తోలినట్లు తెలిసింది. అది కూడా ఎటువంటి అనుమతులు లేకుండా.. గతంలో గ్రావెల్ మాయం చేసిన వారు కాంట్రాక్టర్‌కు వెల కట్టి తోలారనేది సమాచారం. అనుమతులు లేకపోవటం వలనే పగలు కాకుండా రాత్రుళ్లు సీఆర్డీఏ, రైతుల భూముల్లోని మట్టిని తోలినట్లు సమాచారం. సీఆర్‌డీఏ అధికారులు సరిగా స్పందించక పోతే గత వైసీపీ హయంలో మాదిరిగానే రాజధాని ప్రాంతంలోని మట్టి అక్రమార్కుల బారిన పడుతుందని రాజధాని గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామోత్సవంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు

గరుడ వాహనంపై నృసింహుని గ్రామోత్సవం

మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చిలుక ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని బంగారు గరుడ వాహనంపై ఊరేగించారు. శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన స్వామివారిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం వద్దనుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మెయిన్‌బజారు మీదుగా మిద్దె సెంటరును చేరుకుని తిరిగి అదే మార్గంలో దేవస్థానంవరకు సాగింది. భక్తులు పూజలు చేశారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి గ్రామోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బడ్జెట్‌లో చేనేతకు అన్యాయం

మంగళగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడం అన్యాయమని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2,94,427 కోట్ల బడ్జెట్‌లో చేనేతను పూర్తిగా విస్మరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చేనేతకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకటకృష్ణ, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

హామీలను అమలుచేయాలి

మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు అనేక హామీలను ఇచ్చిన పాలకులు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడంలేదని సీపీఎంనేత జేవీ రాఘవులు విమర్శించారు. ప్రజాపోరు ప్రచార యాత్రలో భాగంగా మంగళవారం స్థానిక పాతబస్టాండు సెంటరులో ఆయన ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందని అన్నారు. జమిలి ఎన్నికల పేరుతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే విధానాలను రూపొందిస్తుందని ఆరోపించారు. ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, మంగళవారం ప్రజాపోరు యాత్ర రత్నాలచెరువు, పాతమంగళగిరి, భార్గవపేట, గోపాలకృష్ణ సెంటర్, పార్కురోడ్డు ప్రాంతాల్లో జరిగింది. కార్యక్రమంలో సీపీఎం నేతలు పిల్లలమర్రి బాలకృష్ణ, ఎం.బాలాజీ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

కాకుమాను, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మండలంలో దాదాపు 23 వేల ఏకరాలలో వరిని రైతులు సాగు చేస్తున్నారు. వరిలో బీపీటీ ఎక్కువ విస్తీర్ణంలో సాగు అవుతుంది. ఇప్పటికే వల్లూరు, లింగంటపాలెం, అప్పాపురంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో వర్షాలు కురవడంతో రైతులలో ఆందోళన నెలకొంది. ఇప్పటికే దాదాపు రూ. 40 వేల పెట్టుబడి వ్యయంతో వరి పైరును రైతులు సాగు చేస్తున్నారు. మంగళవారం కురిసిన వర్షానికి పలువురి రైతుల పొలాల్లో వరి నేలకొరిగింది. మరికొంత మంది రైతులు కోతలను వాయిదా వేసుకున్నారు. వర్షం ప్రభావం ఎక్కువగా ఉంటే దిగుబడి తగ్గిపోతుందేమోనని రైతులు దిగాలు చెందుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

జీయోట్యాపింగ్ సర్వేకి సహకరించాలి

- తుళ్లూరు ఎంపీడీవో శిల్పా కానూరి

ఫటా ఫట్



శిల్పా కానూరి
తుళ్లూరు ఎంపీడీవో

తుళ్లూరు నవంబరు 12: (ఆంధ్రజ్యోతి) హౌస్ హోల్డ్ జీయో ట్యాపింగ్ సర్వేకి ప్రజలు సహకరించాలని తుళ్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శిల్పా కానూరి కోరారు. హౌస్ హోల్డ్ జీయో ట్యాపింగ్ సంబంధిత విషయాలపై ఎంపీడీవోతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్.'

ప్ర: జియో ట్యాపింగ్ వలన ప్రయోజనం ఏమిటి.?

జ: విపత్తుల సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. మొన్న జరిగిన వరదల వలన చాలా మంది నష్టపోయారు.హౌస్ హోల్డ్‌సర్వే జరిగితే వారు ఎక్కడ ఉన్నారు. ఎలా ఉన్నారు అనేది తెలుసుకొని వారిని వెంటనే అదుకోవటానికి జీయోట్యాపింగ్ సర్వే పనికి వస్తుంది.

ప్ర: సర్పంచ్‌లు లేరు కదా.. అమరావతి నగరంలో సీఆర్డీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి ఎలా ఉంది ?

జ: సీఆర్డీఏ, పంచాయతీ అధికారులు సమన్వయంతో కలసి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. తాగు నీరు ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాము. డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచటానికి సీఆర్డీఏతో కలసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము

ప్ర: సంక్షేమ పథకాలు అమలకు బ్యాంకు అకౌంట్‌కు అధార్‌కార్డు లింక్ తప్పని సరి అంటున్నారు.. ఎందుకు ?

జ: నిజమే.. దాని గురించి లబ్ధిదారులకు వివరిస్తున్నాము. ఆధార్ కార్డు లింక్ అయ్యి ఉన్న బ్యాంకు అకౌంట్ వలన ప్రభుత్వం ఇచ్చే పథకాల నిధులు ఎటువంటి అవకతవకలు, ఆటంకాలు లేకుండా వారి అకౌంట్‌లోకి చేరతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాలు చాలా అమలు జరుగుతున్నాయి. దీని వలన ప్రజలకు లాభం తప్పితే, నష్టం ఎంత మాత్రం చేత ఉండదు. ఇందుకు ప్రజలు సహకరించాలని సూచిస్తున్నాము.



బాధిత కుటుంబీకులకు ఆర్థికసాయం అందిస్తున్న తహసీల్దార్ సునీత, శ్రీఅనిత

వరద బాధితులకు ఆర్థికసాయం

దుగ్గిరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు, వరదలకు నిరాశ్రయులైన 16 పేద కుటుంబాలకు ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. ఇటీవల అధికవర్షాలతో ఇండ్లు ముంపునకు గురై ఇబ్బందులు పడిన మండల గ్రామం ఈమనికి చెందిన 16 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ. 1 లక్ష 60 వేలను అందించారు. తహసీల్దార్ ఐ. సునీత, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసనేని శ్రీఅనిత, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య, ఆర్‌ఐ త్రివేణి పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ చేపట్టాలి

మంగళగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒక్కో రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు కోరారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీలు అభివృద్ధి చెందాలంటే కాలాయాపన చేయకుండా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో జిల్లాను యూనిట్‌గా తీసుకుంటే నష్టం జరుగుతుందని, తక్షణమే ఆ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. కొమ్మూరి గరటయ్య మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితంగా సుప్రీంకోర్టు స్పందించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను అమలు చేయాలని ఆదేశించడం శుభపరిణామమన్నారు. ఈ నెల 16వ తేదీన విజయవాడలో జరిగే ఎమ్మార్పీఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఏబీసీడీ వర్గీకరణపై పూర్తిస్థాయిలో చర్చించి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఈపూరి ఆదాం, కట్టెపోగు బాబూరావు, పులి దాసు, ఏటుకూరి విజయ్‌కుమార్, కొమరాల శ్రీనివాసరావు, భూషణం, నవీన్, పులి ప్రభుదాసు, కుక్కమళ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

దుగ్గిరాల(ఆంధ్రజ్యోతి), నవంబరు 12: మండల కేంద్రం దుగ్గిరాలలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఆవరణలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన 61 మంది దంపతులు పాల్గొన్న వ్రతాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సాకేత్, రామచంద్రలు భక్తులకు వ్రతవిధానాన్ని వివరించారు. చుండూరు ఉమామహేశ్వరరావు, కొంగర సుధీర్‌కుమార్, వంకదార ఫణికుమార్, పూనపాటి రవి, బాలాజీ తదితరులతోపాటు, కమిటీ సభ్యులు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. వ్రతానంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈనెల 15న శుక్రవారం ఉదయం జరుగు స్వామివారి అభిషేకాలు, సాయంత్రం జరిగే శ్రీవేంకటేశ్వరనామాలు, శంఖుచక్రాలతో లక్ష ఒత్తుల పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

వంశీకృష్ణకు గౌరవ డాక్టరేట్

తాడేపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాదాపు 25 ఏళ్లుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేసి, ఆదివాసి సిద్ధాంతకర్తగా పేరుగాంచిన తాడేపల్లికి చెందిన అనుముల వంశీకృష్ణకు అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ ఉత్తమ సామాజిక సేవకుడిగా గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా, ఆదివాసి మేధావుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా అనుముల వంశీకృష్ణ వ్యవహరిస్తున్నారు. ఈ నెల 30న ఢిల్లీలో జరిగే స్నాతకోత్సవంలో తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారని వంశీకృష్ణ తెలిపారు. వంశీకృష్ణకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి

గ్రంథాలయ వారోత్సవాలు

మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శివాలయం పక్కన వున్న శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని గ్రంథాలయాధికారి ఎన్.ఆరోగ్యం తెలిపారు. వారం రోజులపాటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, మహిళలకు అల్లికలు, రంగవల్లులు తదితర పోటీలతోపాటు పుస్తక ప్రదర్శనలు, అవగాహనా ర్యాలీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. పట్టణ ప్రజలు, పాఠకులు, విద్యార్థులు వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు శాఖా గ్రంథాలయం తాడేపల్లిలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి నాగుర్ బాషా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాగుర్‌బాషా కోరారు.

గంజాయి స్వాధీనం

మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి కలిగివున్నారన్న సమాచారంతో మంగళగిరి రూరల్ పోలీసులు దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం... నవులూరు చెరువు ప్రాంతంలో ముగ్గురు యువకులు గంజాయి కలిగివున్నారని సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడి చేశారు. ముగ్గురిలో ఇద్దరు యువకులు పరారయ్యారు. ఒక యువకుడ్ని అదుపులోకి తీసుకుని 230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మిగతా ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కంకి నల్లి నివారణ చర్యలు పాటించాలి

కాకుమాను, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వరిలో కంకి నల్లి నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి కిరణ్మయి అన్నారు. మండల పరిధిలోని వల్లూరు, లింగంగుంటపాలెం గ్రామాలలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. తొలుత వ్యవసాయ క్షేత్రాన్ని ఏవో సందర్శించారు. వరిలో కంకి నల్లి తెగులు సోకడం గురించి రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏవో కిరణ్మయి కంకి నల్లి నివారణ చర్యలతో పాటు, అగ్గి తెగులు నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఏఏలు హేమంత్, శివప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తం..

వట్టిచెరుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, పంటల సాగు పై రైతుల అనుభవాలు జోడించటం ద్వారా నాణ్యమైన పంటల ఉత్పత్తి, దిగుబడులు సాధించే దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రయోగాత్మకంగా రైతులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రం వట్టిచెరుకూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులతో కలసి పంటల స్థితి గతులపై పలు విషయాలను చర్చించారు. గ్రామ స్వరూపాన్ని అధ్యయనం చేసిన విద్యార్థులు సెంటరులో రంగవల్లులలో గ్రామ విస్తీర్ణం, ప్రధాన రహదారులు, నీటి వనరులు ప్రభుత్వ కార్యాలయాలను తీర్చిదిదటాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు.

పొదుపులో ముందంజ

ఫిరంగిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన దేశంలోని డ్వాక్రా సంఘాలు పొదుపు చేయటంలో ప్రపంచంలోనే ముందంజలో ఉన్నాయని మండల డ్వాక్రా ఏపీఎం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని నుదురుపాడు గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతా దారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులందరూ పొదుపులో పంచ సూత్రాలను పాటించి ఆదాయ సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఆయన కోరారు. సభకు అధ్యక్షత వహించిన ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, సురక్షా యోజన లాంటి బీమాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హెచ్‌ఎం ఇమ్మానియేలు, పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ సుదర్శనరాజు, డ్వాక్రా సీసీ రమాదేవి, నల్లపాడు మాజీ సర్పంచ్ విజయ భాస్కర్, రిసోర్స్ పర్సన్‌లు షేక్ బాజీ, కే వెంకటేశ్వరరావు, మంగయ్య పాల్గొన్నారు.

ఏపీ కాకతీయ సేవా సమాఖ్య

నూతన కమిటీ ఎన్నిక

మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయల్ బ్యాంకట్ హాలులో మంగళవారం ఏపీ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా గోపాలకృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, గౌరవాధ్యక్షుడిగా రామినేని కృష్ణమూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురకొండ బోసుబాబు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నారు. దూదిపల్లి వెంకటరమణ, నన్నపనేని నాగేశ్వరరావు, కాటూరి వీవీ ప్రసాద్‌లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

14 నుంచి బాలల చలన చిత్రోత్సవాలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీ నుంచి బాలల చలన చిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి బొల్లిముంత కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చిల్డ్రన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బాలల చిత్రోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలకు 9959431235ను సంప్రదించాలన్నారు.

సైనేడ్ హత్య కేసు నిందితులపై స్థానికుల దాడి: ఇద్దరికి గాయాలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీసుకొని చెల్లింపుల విషయంలో జాప్యంచేస్తూ సైనేడ్‌తో హత్యలకు పాల్పడి రిమాండ్ నుంచి విడుదలై తెనాలి వచ్చిన నిందితులపై స్థానికులు దాడి చేశారు. స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన తల్లీ కూతుర్లు వెంకటేశ్వరమ్మ, రమణమ్మలు అప్పు ఇచ్చిన వారినే సైనేడ్‌తో హతమార్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారు రిమాండ్ పూర్తవడంతో పట్టణానికి చేరుకున్నారు. ఈ క్రమంలో స్థానికులు వారు హత్యలకు పాల్పడే విధానం తెలిసి భయాందోళనతో ఈ ప్రాంతంలో ఉండవద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారి మధ్య వాదోపవాదాలు పెరగడంతో ఒకరిపై ఒకరూ దాడి చేసుకున్నారు. గాయాలతో ఉన్న బాధితులను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రేపు పెదకాకానిలో ముగ్గురు మాజీ ప్రధానుల విగ్రహావిష్కరణ

● హాజరుకానున్న వైఎస్ షర్మిల

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని సెంటర్‌లో ఏర్పాటుచేసిన ముగ్గురు మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ప్రారంభించేందుకు ఈ నెల 14వ తేదీన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పెదకాకానికి విచ్చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు తెలిపారు. రాజీవ్‌గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జొన్నల వెంకటరెడ్డి, యన్నం సుధీర్‌బాబు, బిళ్ళా సునీల్, చుక్కా చంద్రపాల్ తదితరులున్నారు.

రేపు వైద్య శిబిరం

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ సభ్యులు తెలిపారు. స్థానిక బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు ఉచిత వైద్య శిబిరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన ప్రపంచ మధుమేహం (షుగర్ వ్యాధి) దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో షుగర్ వ్యాధి పరీక్షలు, కంటి పరీక్షలు, కీళ్ల వ్యాధులు, స్త్రీలకు సంబంధిత వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, వైద్య సలహాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

16న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంను నిర్వహిస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్‌లో షార్టుఫాల్స్‌లో పెండింగులో ఉన్న అప్లికేషన్లు, డీమ్డ్ ఫైల్స్ ఇతర సమస్యల పరిష్కారం కోసం 16వ తేదీన పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరంను ఉదయం గం.11 నుంచి సాయంత్రం గం.5వరకు నిర్వహిస్తామన్నారు. భవన నిర్మాణ అనుమతులు కోరుతున్న యజమానులు, లైసెన్స్ సర్వేయర్‌లు పాల్గొని తమ సమస్యను పరిష్కరించుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు

అతివేగం.. నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాద కారకాలు: ఆర్టీవో శ్రీహరి

తెనాలి క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు అతిక్రమించడం, అతివేగం.. నిర్లక్ష్య డ్రైవింగ్‌లే వాహన ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆర్టీవో శ్రీహరి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీఐ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి: ఏడీఏ

తెనాలి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయసాగు విధానంపై రైతులకు అవగాహన అవసరమని ఏడీఏ ఉషారాణి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏవో ప్రేమసాగర్‌తో కలిసి మండలంలోని కోపల్లె, అంగలకుదురు-2 రైతు సేవాకేంద్రాల పరిధిలో పంట పొలాలను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఏవో ప్రేమసాగర్ వరి పంటలకు బీమా చేసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించటం ద్వారా మేలైన దిగుబడులు తక్కువ ఖర్చుతో పొందవచ్చని ఏవో దేగల వెంకట రామయ్య అన్నారు. మండల పరిధిలోని తాళ్లపాలెం, మామిళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి రాజారత్నం, రామాంజనేయులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఇండోర్ స్టేడియం నిర్వహణ

● స్టేడియంకు దూరమవుతున్న క్రీడాకారులు
● గడ్డిజాతిమొక్కలతో నిండిన పరిసరాలు
● వాకింగ్ ట్రాక్ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం
● శాప్ చైర్మన్ ఆదేశించినా మారని పరిస్థితి



పిచ్చిమొక్కలతో ఉన్న స్టేడియం బిల్డింగ్



చెట్ల ఆకులతో నిండి ఉన్న వాకింగ్ ట్రాక్

తెనాలి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇండోర్ స్టేడియం నేడు చిట్టడివిని తలపిస్తూ భావితరాలకు ఈ ప్రాంతంలో క్రీడలకు దూరమయ్యే పరిస్థితికి నెలకొంది. పేదల పిల్లలను సైతం క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో ఏర్పాటు చేసినవే ఇండోర్ స్టేడియంలు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ స్టేడియంలను వ్యాపార ప్రాంగణాలుగా మార్చారు. దీంతో స్టేడియంను సద్వినియోగం చేసుకునేందుకు రుసుము చెల్లించాల్సి రావడంతో పేదల పిల్లలు వాటికి దూరమయ్యారనే చెప్పాలి. దాదాపుగా రూ.2 కోట్లతో ఏర్పాటుచేసిన ఇండోర్ స్టేడియం నేడు నిర్వహణా లోపంతో క్రీడాకారులకు దూరమయ్యే పరిస్థితికి దిగజారింది. గతంలో ఎందరో పేద పిల్లలకు ఉపయోగపడేలా అనేక సౌకర్యాలు కల్పించేందుకు ఈ ప్రాంత వ్యాపారవేత్తలు, సామాజిక సేవాతత్పరులు ఆర్థికసాయం అందించారు. టీడీపీ హయాంలో ఈ స్టేడియం ఓ వెలుగు వెలిగింది. ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్టేడియాల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టు ప్రాతిపదికన కట్టబెట్టింది. దీంతో పేద పిల్లలు స్టేడియంలోకి రావాలంటే రుసుము చెల్లించాల్సివచ్చేది. కాయకష్టం చేసుకునే కుటుంబాలకు ఇది ఆర్థికభారంగా మారింది. నిర్వాహకులు సైతం క్రీడా మైదానాన్ని ప్రైవేట్ ఫంక్షన్లకు అద్దెలకు ఇవ్వడం క్రీడాకారులకు అందించాల్సిన సౌకర్యాలను పూర్తిగా నీరుగార్చడంతో క్రమేపీ దీనిని సద్వినియోగం చేసుకునే వారు తగ్గిపోయారు. దీంతో మైదానం నిండా గడ్డిజాతి మొక్కలు రోజులు తరబడి పెరుగుతూ నేడు చిట్టడివిని తలపిస్తూ కళావిహీనంగా మారింది. ఫలితంగా ప్రభుత్వం మారినా ఆ పాలన జ్ఞాపకాలు ఇంకా ఇక్కడే పిచ్చిమొక్కలు, వ్యర్థాల రూపంలో పదిలంగా ఉన్నాయి. స్టేడియంలో ఉన్న జిమ్ పరికరాలు, వాకింగ్ ట్రాక్ సైతం ఆకులు, గడ్డిజాతి మొక్కలతో నిండి దర్శనమిస్తున్నాయి. స్టేడియం బిల్డింగ్‌కు చుట్టూ గడ్డిజాతి మొక్కలు పెద్దఎత్తున పెరిగి విషపురుగులకు స్థావరాలుగా మారాయి. క్రీడాకారులకు అందించాల్సిన సౌకర్యాలు సైతం పూర్తిస్థాయిలో లేవంటే అతిశయోక్తికాదు. పేదల పిల్లలను క్రీడాకారులగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు స్టేడియంను సంప్రదించే క్రమంలో చుట్టూ ఉన్న వాతావరణాన్ని చూసి అందులోకి వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఉదయం, సాయంత్రం వాకర్స్ వస్తుంటారు. ఇలా గడ్డిపెరిగిపోయి ఉండటంతో విషపురుగుల భయంతో వాకర్ల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖంపట్టింది. అధికార యంత్రాంగం స్టేడియంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి పేదల పిల్లలకు, వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

శాప్ చైర్మన్ చెప్పినా మారని తీరు

ఇటీవల తెనాలి ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభోత్సవానికి విచ్చేసిన క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ స్టేడియం దుస్థితిని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టూ ఉన్న గడ్డిజాతి మొక్కలతో ఇది క్రీడాప్రాంగణమా లేక చిట్టడివా అంటూ అధికారులను నిలదీశారు. రాష్ట్రస్థాయిలో స్కూల్ గేమ్స్ జరుగుతున్నాయని తెలిసి కూడా గ్రౌండ్‌ను అందుకు అనుగుణంగా తీర్చిదిద్దకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న మునిసిపల్ అధికారులకు సైతం గ్రౌండ్‌లో జంగిల్ క్లియరెన్స్‌కు చొరవ చూపాలని ఆదేశించారు. ఇది జరిగి దాదాపుగా నెల కావస్తున్నా ఇప్పటికి ఆయన ఆదేశాలు అమలుకునోచుకోలేదు.

క్రీడాప్రాంగణాలను వ్యాపారకేంద్రాలుగా మార్చారు

● వీరవల్లి మురళి



క్రీడాప్రాంగణాలను వ్యాపార కేంద్రాలుగా మార్చిన దుర్మార్గపు ప్రభుత్వ పాలన వైసీపీదేనని గణేష్ యూత్ కన్వీనర్ టీడీపీ నేత వీరవల్లి మురళి ఆరోపించారు. పేదల పిల్లల్లో క్రీడా నైపుణ్యాన్ని అనిచివేయవద్దంటూ అప్పట్లో వైసీపీ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తామంతా ఇండోర్ స్టేడియంలో నిరసన కార్యక్రమాలు కూడా చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలిపేలా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని అందుకు అనుగుణంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి స్టేడియంలో సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పరిష్కరించి పేద పిల్లలు గొప్ప క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా చూడాలని మురళి విజ్ఞప్తి చేశారు.

వరి రైతుకు వాన గండం

● పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో 30 వేల ఎకరాల్లో వరి పైరు



చింతలపూడిలో నేలవాలిన వరి పైరు

పొన్నూరు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాలోని వరి రైతుకు వాన గండం ఎదురవుతోంది. రెండు మండలాల్లో 30వేల ఎకరాలలో వరి పైరు సాగవుతోంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం మంగళవారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో వర్షపు జల్లులు కురిశాయి. పొన్నూరు ప్రాంతంలోని వరి పైరు కోతకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితిలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పంట నీటి పాలవుతుందేమోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలో వరి పైరు నేల వాలటంతో వర్షాలు కురిస్తే వాన నీటిలో వరి కంకులు నాని మొలకెత్తుతాయేమోనని ఆందోళనలో ఉన్నారు.

చిరుజల్లులతో వర్షం.. రైతుల గుండెల్లో రైళ్లు

కొల్లిపర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా మంగళవారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావటంతో పాటు చిరుజల్లులతో వర్షం పడటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. డెల్టాలో మాగాణి భూమిలో వేసిన వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో వర్షం పడితే చేతికి వచ్చిన పంటకు నష్టం వాటిల్లు తుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. ముందుగా వేసిన వరినాట్లు రెండు, మూడు రోజుల్లో కోతకోయడానికి సన్నాహాలు చేస్తున్న కొల్లిపర మండల రైతాంగానికి వాతావరణంలో వచ్చిన మార్పులు రైతుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. కొల్లిపర మండలంలో ఈ సంవత్సరం 6వేల 150 హెక్టార్లలో రైతులు ఈ సంవత్సరం వరి సేద్యం చేశారు. అందులో 95 శాతం రైతులు వెద పద్ధతి ద్వారా వరి సాగు చేస్తుండగా, మిగిలిన అయిదు శాతం రైతులు సాంప్రదాయ పద్ధతిలో వరి నాట్లు ద్వారా సేద్యం చేయడం జరిగింది. డివిజన్‌లో ఎక్కువ శాతం మంది రైతులు బీపీటీ 5204ను వరి విత్తనం సాగు పట్ల ఆసక్తి చూపి రైతులు ప్రత్యేక శ్రద్ధతీసుకున్నారు. వెద పద్ధతి ద్వారా వేసిన వరినాట్లు 50 శాతం కోత దశకు వచ్చాయి. రెండు, మూడు రోజుల్లో వరి కోతల ప్రారంభానికి రైతులు సిద్ధపడుతున్నారు. ఈ సమయంలో గాలితో కూడిన వర్షం పడితే వరి పంటకు భారీగా నష్టం జరుగుతుందని రైతులు వ్యక్తం చేస్తున్నారు.


పారిశుధ్య పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మురుగు కాలువలలోని వ్యర్థాలను తొలగించాలని పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు ఆదేశించారు. స్థానిక నాజరుపేటలోని 7, 8వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పట్టణ పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు పరిశీలించి శానిటరీ అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేర నియంత్రణకు ప్రజలు సహకరించాలి

● త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగే నేర నియంత్రణలో భాగంగా పోలీసు శాఖ తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు కోరారు. స్థానిక మారీసుపేటలో మంగళవారం గుంటూరు రోడ్డులోని పాత బస్టాండ్ సెంటరు నుంచి ఎరువులకొట్ల బజార్ వరకు నిఘా నేత్రాల ఏర్పాటు కోసం పలు ప్రాంతాలను పరిశీలించి షాపుల యజమానులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపు యజమానులు తమ షాపులకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఆటో కార్మికులు తగిన సహకారం అందించాలని, నిర్దేశిత ప్రాంతాలలో ఆటోలను ఏర్పాటు చేసుకోవాలని రమేష్‌బాబు సూచించారు.



దశావతారం సన్నిధిలో జరిగిన సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

పెదకాకాని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి వారి దివ్య క్షేత్రంలో మంగళవారం కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూర్ణ భాస్కరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి ఆలపాటి సాయం



ఆలపాటి సహకారంతో నాగూర్‌బాబుకు తోపుడు బండిని అందిస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండి కుటుంబాన్ని పోషించుకునేందుకు తోడ్పాడు అందించాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఫోన్ ద్వారా కోరటంతో స్పందించారు. తెనాలి 20వ వార్డుకు చెందిన చిరువ్యాపారి షేక్ నాగూర్ బాబు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ తనకు తోపుడు బండి సమకూరిస్తే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటివి అమ్ముకుంటూ జీవనం సాగిస్తానని తెలిపాడు. దీంతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పందించి తోపుడు బండిని సమకూర్చారు. దీనిని మంగళవారం పార్టీ నాయకులు వసంతం అశోక వర్ధన, ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్‌కుమార్, జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి అక్కిశెట్టి వెంకటేశ్వరరావులు నాగూర్‌బాబుకు అందజేశారు.

కృష్ణానదికి సమీప గ్రామాలకు మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుక

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కృష్ణానది అనుకుని ఉన్న గ్రామాలకు మాత్రమే ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను తరలించేందుకు అనుమతించడం జరిగిందని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక రీచ్‌లను నడిపే వారితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ మండలంలో అత్తలూరివారిపాలెం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, హనుమాన్‌పాలెం, బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామాలకు మాత్రమే ఉచిత ఇసుకతోలుకోవటానికి అనుమతించినట్లు తెలిపారు. ఈ గ్రామాల వారు కూడా ఆన్‌లైన్‌లో ఇసుకకోసం నమోదు చేసుకుంటేనే ట్రాక్టర్ ద్వారా అనుమతించడం జరిగిందన్నారు. తెనాలి, గుంటూరు పట్టణాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలియజేశారు. ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ అక్రమ ఇసుకను అరికట్టడానికి మండలంలో 7చోట్ల చెక్కుపోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొనసాగిస్తున్నారు. స్థానిక చెంచుపేటలో మంగళవారం రోడ్డు మార్జిన్‌లపై ఆక్రమణలను పురపాలక సంఘ అసిస్టెంటు సిటీప్లానింగ్ అధికారి శ్రీమన్నారాయణ ఆదేశాలతో అధికారులు తొలగించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, చైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులను అభినందించిన ఉపకులపతి గంగాధరరావు

పెదకాకాని, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న అందజేసిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల జాబితాలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు అవార్డులు పొందడం సంతోషంగా ఉందని విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు అన్నారు. మంగళవారం ఆరుగురు అవార్డు గ్రహీతలను ఆయన సన్మానించారు ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఒకేసారి ఆరుగురు అధ్యాపకులు ఆచార్య యం. త్రిమూర్తి రావు, ఆచార్య వై.అశోక్ కుమార్, ఆచార్య ఎన్. వి. కృష్ణారావు, ఆచార్య డి.రామచంద్రన్, డాక్టర్ పి. బ్రహ్మాజీరావు, పి.పూర్ణచంద్రరావులకు అవార్డులు రావడం అభినందనీయమన్నారు.

సులభతర బోధనపై శిక్షణ

పొన్నూరు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలను సులభతరంగా బోధించాలని విద్యాశాఖ రాష్ట్రస్థాయి కోఆర్డినేటర్ టి వీరయ్య అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయుల బోధన మెరుగుదల అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేవతికి పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు

తెనాలి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన క్రీడాకారిణి వక్కలగడ్డ రేవతి పవర్ లిఫ్టింగ్‌లో ఐదు బంగారు పతకాలు లభించాయి. ఈ నెల 10న జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో 76 కిలోల విభాగంలో, ఎక్విప్డ్, అన్ఎక్విప్డ్, బెంచ్‌ప్రెస్ విభాగాల్లో ఐదు బంగారు పతకాలు సాధించింది. సత్తా చూపిన రేవతిని పలువురు అభినందించారు.

16న రాజకుమారి దంపతులకు పురస్కారం

తెనాలి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పావులూరి సరోజినీదేవి, బాపయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతులకు ఈ నెల 16న ఆదర్శదంపతుల పురస్కారం అందజేస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు తెలిపారు. వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఈ పురస్కారం అందించనున్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

● పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్



తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకరం మారే ప్రమాదముందని పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్ వెల్లడించారు. పద్మశాలి పేటలోని పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం ఆంధ్రజ్యోతితో డెంగీపై వెల్లడించిన వివరాలు..

ప్రశ్న: డెంగీ జ్వరం అంటే ఏమిటి?

జవాబు: డెంగీ జ్వరం అనేది డెంగ్యు దోమల ద్వారా సంక్రమించే వ్యాధి.



ప్ర: ఈ వ్యాధి లక్షణాలు ఏంటి?

జ: ఆకస్మిక అధిక జ్వరం, కీళ్ళ నొప్పులు, తీవ్రమైన కండరాల నెప్పి, అలసట, వికారం, అతిసార లక్షణాలు, వాంతులు అవుతాయి. ప్లేట్‌లెట్ కౌంటు తగ్గుతుంది. ప్లేట్‌లెట్ కౌంటు సాధారణంగా 1.50 లక్షలు నుంచి 4.50 లక్షలు ఉంటాయి కాని డెంగీ జ్వరం వచ్చిన వారికి ఈ కౌంటు తగ్గుతుంది ఇది ప్రమాదకరం.

ప్ర: డెంగీ జ్వరం ఎంతకాలం ఉంటుంది?

జ: డెంగీ జ్వరం మూడు నుంచి ఏడు రోజుల వరకు ఉంటుంది. దీనికి వెంటనే వైద్య చికిత్సలు తీసుకోవాలి.

ప్ర: డెంగీ వ్యాధికి ఎటువంటి చికిత్సను అందిస్తారు?

జ: వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ చేసిన తరువాత మందులను ఉచితంగా అందిస్తాం.

ప్ర: వ్యాధులు సోకినవారు ఎటువంటి ఆహారం నియమాలు పాటించాలి?

జ: కాచి చల్లార్చిన నీరు తాగటం తాజా కూరగాయలు, ఆకుకూరలు, తాజా పండ్లు తగినంత విశ్రాంతి తీసుకోవడం, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా త్వరగా కోలుకొనే అవకాశం ఉంటుంది.

అప్రోచ్ రోడ్డు వద్ద ఆదమరిస్తే అంతే సంగతులు..!



సమస్య ఇది.. స్పందించరూ

కొల్లిపర మండలం మున్నంగి గ్రామ వద్ద రేపల్లె కాల్వపై ఏర్పాటు చేసిన వంతెనకు- చిన్న కరకట్టకు ఉన్నటువంటి ఆప్రోచ్‌రోడ్డు సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. సంవత్సరాలు గడుస్తున్నప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. వాహనచోదకులు అప్రమత్తంగా లేకుంటే పదిఅడుగుల గొయ్యిలోకి పల్టీకొట్టడం ఖాయం. కొత్తవారు ఈ మార్గంలో రాత్రి సమయంలో ప్రయాణం ప్రాణాంతకం అని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

- కొల్లిపర, ఆంధ్రజ్యోతి

పోలీసుల అదుపులో మహిళా దొంగలు



తెనాలి క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వరపేట తోటవారి వీధిలో గత గురువారం జరిగిన దొంగతనం కేసులో మహిళా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు తెలిపారు. మంగళవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గత గురువారం చెరుకుపల్లికి చెందిన ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునే శీలం రోశమ్మ, శీలం మహంకాళమ్మలు తోటవారి వీధిలో ఆ వస్తువులు వేరు చేసుకొనేందుకు వచ్చారు. విష్ణుబొట్ల మల్లికార్జునశర్మ ఇంటి వద్ద ఎలాంటి అలికిడి లేకపోవడం, ఇంటికి తాళాలు వేసి ఉండటం గుర్తించి గోడ దూకి ఇంటిలోకి ప్రవేశించి పక్కనే ఉన్న ఇనుపరాడ్‌తో తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 80 గ్రాముల బంగారు గొలుసులు, నాలుగున్నర కిలోల వెండి పళ్లాలు, చెంబులను దొంగిలించి తమ వెంట తెచ్చుకున్న కాగితాలలో వేసుకునే గోతాలలోనే వేసుకుని పారిపోయారు. దీనిపై మల్లిఖార్జునశర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ సుబ్బయ్య, వివిధ సాంకేతిక అంశాల ఆధారంగా ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. రోజుల వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ మల్లికార్జునరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అదృశ్యం అయిన వ్యక్తి మృతి

తెనాలి, మారీసుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడి ఇంట్లో ఫంక్షన్ వెళ్లి వస్తానంటూ వెళ్లిన వ్యక్తి కాలువలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ముత్తెంశెట్టిపాలెంకు చెందిన టి.అనిల్‌కుమార్ (39) టెంటుహౌస్ నిర్వహిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం తన స్నేహితుడి కుమారుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం జగ్గడిగుంటపాలెం వద్ద కాలువలో అతని మృతదేహన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అనిల్ కుమార్ మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అమ్మమ్మను బెదిరిస్తున్న మనవళ్లకు కౌన్సెలింగ్

తెనాలి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మృతిచెందడంతో ఆ బిడ్డలను అమ్మమ్మ చేరదీసింది. వారిని పెంచి పెద్దచేసి చివరి దశలో అండగా ఉంటారని ఆశపడింది. గంజాయి, మద్యానికి బానిసలైన మనవళ్ల తన ఇంటిని కబ్జాచేసి రోడ్డుపైకి నెట్టినా సహించింది. చివరకు వారి ఆగడాలు శృతిమించి చంపుతామంటూ బెదిస్తుండటంతో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మొర పెట్టుకుంది. తెనాలి మండలం కొలవరం గ్రామానికి చెందిన గరిక దుర్గ, నాగేశ్వరరావు దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరికి వివాహం చేయగా తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. పెద్దకుమారుడు గరిక చెన్నకేశవరావుకు సంతానం గరిక మణికంఠ, గరికసాయి ఉన్నారు. చిన్నకుమారుడు వెంకటరమణకు సురేష్ అనే కుమారుడున్నాడు. దుర్గ భర్త నాగేశ్వరరావు మృతి చెందగా ఆమె రైల్వేలో స్వీపర్‌గా పనిచేస్తూ రిటైర్డ్ అయ్యింది. ఇద్దరు కుమారులు, కోడళ్లు అనారోగ్యంతో మృతి చెందడంతో మనుమళ్లను అమ్మమ్మ దుర్గ చేరదీసింది. మనవళ్ల మణికంఠకు 28 సంవత్సరాలు కాగా సాయికి 26 సంవత్సరాలు, సురేష్‌కు 21 సంవత్సరాలు. వీరు గంజాయి, మద్యంకు బానిసలుగా మారి జల్సాలకు డబ్బులివ్వాలని అమ్మమ్మపై ఒత్తిడిచేస్తూ వేధిస్తున్నారు. తెనాలిలోని చెంచుపేట ఇందిరాకాలనీలో అమ్మమ్మకు ఉన్న పక్కా గృహాన్ని మనుమడు గరిక సాయి ఆక్రమించుకుని ఆమెను ఇంటినుండి బయటకు నెట్టివేశాడు. దీంతో కొలవరంలో మరో ఇల్లు ఉండటంతో అమ్మమ్మ దుర్గ అక్కడ తలదాచుకుంటుంది. ఆమెకు వచ్చే పెన్షన్‌తో జీవితాన్ని గడుపుతూ వస్తోంది. ఈ క్రమంలో మణికంఠ, సాయిలు ఆమె వద్దకు వచ్చి ఆస్తి తమపేరుపై రాయాలంటూ బెదిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మనవళ్ల పెట్టే వేధింపులు తాళలేక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆమె ఫిర్యాదుచేసి రక్షణ కల్పించాలని వేడుకుంది. దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణను విచారించాలని ఆదేశాలందటంతో మంగళవారం బాధితురాలిని, మనుమళ్లను తహసీల్దార్ ఎదుట రూరల్ పోలీసులు హాజరుపరిచారు. మనవళ్లకు తహసీల్దార్ గోపాలకృష్ణ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మరో మారు ఇటువంటివి పునరావృతం అయితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అమ్మమ్మ వారిని ఏం అనవద్దంటూ అధికారులను తిరిగి వేడుకోవటం కొసమెరుపు.